

వైభవంగా శ్రీవారి వసంతోత్సవం


పూజలో పాల్గొన్న భక్తులు

కదిరి పట్టణం లోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 16 రోజుల పండుగ వసంతోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వసంత వల్లభుడికి ఆలయం లోని రంగ మండపంలో మధ్యాహ్నం స్నపన తిరుమంజన సేవ నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను వివిధ పుష్పాలతో అలంకరించారు. తోమాల సేవ, పంచామృత అభిషేకం, హారతి తదితర సేవలు న్విహించారు. సాయంత్రం తిరువీధుల్లో స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఉభయదారులు, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, కదిరి


స్నపన తిరుమంజన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై
అవిశ్వాసం

- కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చిన కౌన్సిలర్లు


కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న కదిరి కౌన్సిలర్లు

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్ నజీమున్నీసాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతున్నట్లు కౌన్సిలర్లు కలెక్టర్ టీఎస్ చేతన్‌కు తెలిపారు. బుధవారం కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌తో కలిసి కలెక్టరేట్‌కు వచ్చిన కౌన్సిలర్లు కిన్నెరకళ్యాణ్, రంగారెడ్డి అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 26 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసిన పత్రాన్ని కలెక్టర్‌కు అందించారు. అనంతరం ఎమ్మెల్యే కందికుంట విలేకర్లతో మాట్లాడుతూ.. కదిరి మున్సిపాలిటీ అభివృద్ధికి ఏమాత్రం సహకరించని చైర్‌పర్సన్‌ను సొంతపార్టీ కౌన్సిలర్లే వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. చైర్‌పర్సన్ నిరంకుశ వైఖరితో కదిరి మున్సిపాలిటీ అభివృద్ధి కుంటుపడిందన్నారు. మున్సిపాలిటీ అభివద్ధి, ప్రజల సంక్షేమ దృష్ట్యా అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు.

తీరని ఈకేవైసీ ఇక్కట్లు

కార్డుదారులు, డీలర్లకూ తిప్పలే

- జిల్లాలో రేషన్ కార్డులు : 5,66,189.. లబ్ధిదారులు :16,89,531 మంది
- 15,15,934 మంది ఈకేవైసీ పూర్తి
- ఇంకా 1,73,597 మంది పెండింగ్
- ఈ-పోస్ ఆప్షన్లతో మరిన్ని ఇబ్బందులు
- ఈనెల 30 వరకు గడువు పొడిగింపు

ఈకేవైసీ కష్టాలు ఇప్పట్లో తీరేలే లేవు. దీంతో రేషన్‌కార్డుదారులకు, ఇటు డీలర్లకూ తిప్పలు తప్పడం లేదు. కుటుంబ సభ్యులందరికి ఈకేవైసీ చేయించాలన్న నిబంధనతో వేలిముద్రలు, ఆధార్ అప్‌డేట్స్, ఈ-పోస్ సమస్యలు.. ఇలా ఒకటిపోతే మరొకటి అన్నట్లు తయారయింది. లబ్ధిదారులు మీసేవ కేంద్రాలు, డీలర్ల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఈకేవైసీ పూర్తి కాకపోతే సరుకులు సరఫరా చేసేది లేదని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో డీలర్లు కూడా సతమతమవుతున్నారు.


ధర్మవరంలోని కేశవ నగర్‌లో ఈకేవైసీ చేయిస్తున్న డీలర్

ధర్మవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్‌కార్డుదారులకు ఈకేవైసీ కష్టాలు కొనసాగుతున్నాయి. గతంలో వైసీపీ ప్రభుత్వం ఈకేవైసీలను చేపట్టింది. సరిగా వేలిముద్రలు పడని వాటికి ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నట్లు చూపుతున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఈకేవైసీ పూర్తి చేయడానికి సిద్ధమవుతోంది. ఈ మేరకు జిల్లా అధికారులు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్లు, రేషన్‌డీలర్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పలుసూచనలు జారీ చేశారు. పెండింగ్ కార్డుదారుల జాబితాలను సిద్ధం చేసి డీలర్లకు అందించారు. ప్రస్తుతం ఈకేవైసీ పూర్తి కాకపోతే ఏప్రిల్‌లో సరుకులు నిలిచిపోతాయని అధికారులు డీలర్లకు సూచించారు. దీంతో వారు సంబంధిత రేషన్ దుకాణాల వారిగా పరుగులు తీస్తూ ఈకేవైసీ చేపట్టారు. జిల్లాలో 5,66,189 రేషన్‌కార్డులకు సంబంధించి 16,89,531 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో 15,15,934 మందికి ఈకేవైసీ పూర్తి చేశారు. ఇంకా 1,73,597 మందికి ఈకేవైసీ ఇంకా పెండింగ్‌లో ఉన్నట్లు అధికారుల రికార్డుల ద్వారా తెలుస్తోంది. వీరిలో పిల్లలు, వృద్ధుల వేలిముద్రలు పడకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు, చనిపోయిన వారి వివరాలను నమోదు చేయాలని అధికారులు సూచించారు. మార్చి 31 నాటికి ఈకేవైసీ పూర్తిచేయాలని ప్రభుత్వం ముందుగా ప్రకటించి ప్రకటించింది. నమోదులో నెల కొన్న సమస్యలను గమనించి ఏప్రిల్ 30 వరకు ప్రభుత్వం గడువు పెంచింది. దీంతో డీలర్లతో పాటు కార్డుదారులు కూడా ఊపిరి పీల్చుకున్నారు.

ఈ-పోస్‌తో ఇబ్బందులు

ఈ-పోస్ మిషన్లలో పలు సమస్యలు నెలకొన్నాయి. ఈకేవైసీ వేసినప్పుడు సక్సెస్ అని వస్తే పూర్తయినట్టు.. లేకపోతే చిన్నపిల్లలు, మరెవరైనా ఆధార్ సెంటర్లకు వెళ్లి అప్‌డేట్ చేసుకోవాలి. 300 ఎర్రర్ కోడ్ వస్తే సమీపంలోని ఆధార్ కేంద్రానికి వెళ్లి బయోమెట్రిక్ నవీకరించాలి. 330 ఎర్రర్ వస్తే బయోమెట్రిక్ లాక్డ్, ఆధార్ హోల్డర్ ఆధార్ సెంటర్‌కు వెళ్లి అన్‌లాక్ చేయించుకోవాలి. 511 ఎర్రర్ వస్తే ఇన్‌వాలిడ్ పీఐడీ ఎక్స్‌ఎంఎల్ ఫార్మెట్ బయో మెట్రిక్‌లను నవీకరించాలి. 811 ఎర్రర్ వస్తే మిస్సింగ్ బయోమెట్రిక్ డేటా సీఐడీఆర్ ఆధార్ కేంద్రంలో బయోమెట్రిక్‌లను నవీకరించాలి. 996,997 ఎర్రర్ వస్తే ఆధార్ క్యాన్సిల్డ్ అని వస్తే కొత్త ఆధార్‌ను చేసుకోవాలి. ఇలాంటి ఆప్షన్లతో కార్డుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైసీపీ పాలనలో రేషన్‌కార్డులను సచివాలయం పరిధిలోకి తీసుకుని వచ్చి ఒక దుకాణంలో ఉన్న కార్డులను రెండు విధాలుగా విభజించి మ్యాపింగ్ చేసి అధికారులు గందరగోళం చేశారు.

ఇంటింటికీ రేషన్ సమాచారం నిల్

వైసీపీ ప్రభుత్వం ఇంటింటికి రేషన్ విధానంతో రేషన్ కార్డుదారుల చిరునామా, ఫోన్ నంబర్ల సమాచారం లేకుండా పోయాయని డీలర్లు మండిపడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పౌరసరఫరాల కార్యాలయం వారు ఇచ్చిన ఆదేశాలతో ప్రతీ కార్డుదారుడి చిరునామా ఉండేది. ప్రస్తుతం అడ్రస్‌లు లేకపోవడంతో డీలర్లు అసిస్టెంట్లను ఏర్పాటు చేసుకుని గ్రామాల్లో అడ్రస్‌లు అడుగుతూ ఈకేవైసీలు పూర్తిచేస్తున్నారు.

నెలాఖరులోగా పూర్తి చేస్తాం

ఇప్పటి వరకు ఈకేవైసీ చేయించుకోని వారికి ఈనెల ఆఖరిలోగా పూర్తి చేస్తాం. వృద్ధులు, వలస వెళ్లిన వారు, చదువుల కోసం బయట ప్రాంతాలకెళ్లిన విద్యార్థులు, చిన్నపిల్లలకు, ఆధార్‌అప్‌డేట్ కానీ వారికి సంబంధించినవి పెండింగ్‌లో ఉన్నాయి. వలసలు, ఇతర ప్రాంతాల్లో ఉన్నవారికి సమాచారం ఇచ్చి ఈకేవైసీ చేయించుకునేలా చూడాలని డీలర్లకు తెలియజేశాం. ఈ నెలాఖరు వరకు గడువు ఉంది. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- వంశీకృష్ణారెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి




కు(ఎ)ండల కాలం

- వేసవి రాకతో డిమాండ్ ● చల్లటి తాగునీటి కోసం కొనుగోలు
- ఎన్నెన్నో ఆరోగ్య ప్రయోజనాలు

వేగంగా!

అడుగంటుతున్న జలాశయాలు
వేసవి నీటి ఎద్దడిపై ఆందోళన

6



పల్లె దారులు.. ప్రగతి వైపు..

- గ్రామీణ రోడ్లకు మహర్దశ
- జిల్లాలో 218 కి.మీ. సిమెంటు రోడ్లు
- నూతన రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు


హిందూపురం మండలం పూలకుంటలో నిర్మించిన సిమెంట్ రోడ్డు



కొత్తచెరువు బీసీ కాలనీలో సిమెంటు రోడ్డు వేయక ముందు దుస్థితి (ఫైల్)



సిమెంటు రోడ్డు నిర్మించిన తరువాత..

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో గుంతలమయమైన గ్రామీణ రోడ్లకు ప్రస్తుతం మహర్దశ పట్టింది. వందల కిలోమీటర్ల సిమెంటు రోడ్ల నిర్మాణం చూసి ప్రజలు సంబర పడుతున్నారు. జిల్లాలోని 32 మండలాల్లో రూ.110కోట్ల ఉపాధి పథకం నిధులతో 218 కిలోమీటర్ల నూతన సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టారు. రూ. ఐదు కోట్లతో పది కిలోమీటర్ల తారు రోడ్డును నూతనంగా నిర్మించారు.

రూ.15కోట్లతో గుంతలు పూడ్చారు

వైసీపీ పాలనలో గ్రామీణ రోడ్ల బాగోగులు గాలికొదిలేశారు. కొత్తరోడ్లు వేయకపోగా, ఉన్నరోడ్ల మరమ్మతులు సైతం పట్టించుకోలేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా రోడ్లు మోకాళ్ల లోతు గుంతలతో అధ్వానంగా మారాయి. గత ఏడాది జిల్లాలో భారీ వర్షాలు కురవడంతో రోడ్లపై ప్రయాణం చేయడానికి ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. నూతన ప్రభుత్వం కొలువుదీరాక గుంతలుపడిన రోడ్లకు మరమ్మతులు చేపట్టింది. ఇప్పటికే జిల్లాలోని ప్రతిరోడ్డుపై ఉన్న గుంతలను ఆర్‌అండ్‌బీ అధికారులు పూడ్చారు. ఇందుకోసమే రూ.15 కోట్లు ఖర్చు చేసినట్లు ఆర్‌అండ్‌బీ ఈఈ సంజీవయ్య తెలిపారు.



బుక్కపట్నంలో గుంతలుపడిన రోడ్డును చూపుతున్న టీడీపీ నాయకులు (ఫైల్)



ప్రస్తుతం బుక్కపట్నం రోడ్డు

దుర్గంధం వచ్చేది



గతంలో మాకాలనీకి వచ్చే మెయిన్ రోడ్డుపై మురుగు పారుతుండేది. పక్కనే ఉన్న బీసీ హాస్టల్ విద్యార్థులు కూడా దుర్వాసన వల్ల ఇబ్బందులు పడేవారు. నడిచి వెళ్లడానికి కూడా ఇబ్బందిగా ఉండేది. నూతన ప్రభుత్వం వచ్చిన వెంటనే సిమెంటు రోడ్డు వేయడంతోపాటు, మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయడంతో, సమస్య తీరింది. ఇప్పుడు మా కాలనీలో పరిశుభ్రమైన రోడ్డు ఉంది.

- పద్మావతి, బీసీ కాలనీ, కొత్తచెరువు

నడిచి వెళ్లలేకపోయేవాళ్లం



బుక్కపట్నం ఎస్సీకాలనీ నుంచి పుట్టపర్తి వెళ్లే రోడ్డు మొత్తం గుంతలు పడి, నీరు నిలిచి నడిచి వెళ్లడానికి కూడా వీలుండేదికాదు. ప్రస్తుత ప్రభుత్వం గుంతలను పూర్తిగా పూడ్చి, కొంతమేర తారురోడ్డు వేయించింది. ఇపుడు ఈరోడ్డుపై రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి.

- సుధీర్, బుక్కపట్నం ఎస్సీకాలనీ

వంద కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు

జిల్లాలో ప్రతి గ్రామాన్ని అనుసంధానం చేస్తూ వంద కిలోమీటర్ల నూతన తారురోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ముఖ్యంగా గ్రామాలు, మండలకేంద్రాలు, పట్టణాలు, జాతీయ రహదారులకు అనుసంధానం చేస్తూ నూతన రోడ్ల నిర్మాణం చేపడతాం. జిల్లాలోని ప్రతి గ్రామంలో వందశాతం సిమెంటు రోడ్లు వేస్తాం. 30కిలోమీటర్ల నూతన సిమెంటు రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలకు పంపాం.

- డాక్టర్ బండారు మురళీమోహన్, ఎస్ఈ, పంచాయతీరాజ్ శాఖ

పరిశ్రమలతో
పేదరిక నిర్మూలన

ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు
మడకశిర మండలంలో భూముల పరిశీలన


భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఏపీఐఐసీ చైర్మన్

మడకశిర రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు స్థాపించడం ద్వారా యువతకు ఉపాధి లభించి పేదరికాన్ని నిర్మూలించవచ్చని ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు పేర్కొన్నారు. ఆ దిశగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. మండలంలోని ఆర్ అనంతపురం గ్రామ సమీపాన పరిశ్రమల కోసం సేకరించిన భూములను కలెక్టర్ చేతన్‌తో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం ఏపీఐఐసీ చైర్మన్ మాట్లాడుతూ.. పీఎం చంద్రబాబు నాయుడు మడకశిరకు వచ్చినపుడు ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు హామీ ఇచ్చారన్నారు. అందులో భాగాంగానే ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఆర్ అనంతపురం వద్ద రెండు పరిశ్రమలు, బుళ్లసముద్రం పంచాయతీ పరిధిలో సోలార్ పార్కు ఏర్పాటవుతున్నాయన్నారు. అందుకోసం అధికారులు అన్నీ సిద్ధం చేసినట్లు తెలిపారు. తద్వారా దాదాపు 4 వేల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ఏపీఐఐసీ జెడ్ఎం సునానాసోనీ, ఆర్డీఓ ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు చర్యలు : కలెక్టర్

అగళి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రైతులు భూములు ఇస్తే పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. అగళి మండలం హెచ్‌డీ హళ్లి పంచాయతీలోని భూములను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగళి మండలం కర్నాటక సరిహద్దుకు ఆనుకుని ఉందని, జాతీయ రహదారికి దగ్గరలో ఉండడంవల్ల ఇక్కడ పరిశ్రమలు స్థాపిస్తే వేలాది మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి లభిస్తుందనే ఉద్దేశ్యంతోనే భూములను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రైతులు పంటలు సాగుచేసిన భూమి వివరాలను పరిశీలించి నివేదిక తయారు చేయాలని తహసీల్దార్ సుబ్బారావును సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ ఆనంద్‌కుమార్, తహసీల్దార్ సుబ్బారావు, జడ్పీటీసీ సభ్యుడు ఉమేష్ ఉన్నారు.

టీఎంసీ నీరు నిల్వ చేయడమే లక్ష్యం

ఏడాదిలో 1.10 కోట్ల ఉపాధి పనిదినాలు కల్పించాం

డ్వామా పీడీ సలీం బాషా



అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న నీటి కుంటల నిర్మాణంతో జిల్లాలో టీఎంసీ నీటిని నిల్వ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని డ్వామా పీడీ సలీంబాసా తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులు, జిల్లాలో పురోగతి అంశాలపై డ్వామా పీడీతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ..

ప్రశ్న: నీటి కుంట అంటే ఏంటి? దాని ఉపయోగం ఏంటి?

జవాబు: రైతుల పొలాల్లో వర్షపునీటిని అక్కడే ఇంకింపజేయడానికి తీసే గుంతనే నీటికుంట అంటారు. దీని నిర్మాణంతో పొలాలకు మందులు కొట్టేందుకు, పశువులు, పక్షులకు తాగునీటి సదుపాయం కల్పించడంతో పాటు ఆరుతడి పంటలను సాగుచేసుకునే అవకాశాలుంటాయి.

ఇంటర్వ్యూ interview

ప్రశ్న: జిల్లాకు ఎన్ని నీటికుంటల నిర్మాణాన్ని లక్ష్యంగా నిర్ణయించారు?

జవాబు: జిల్లాలో జూన్ చివరి నాటికి 9వేల నీటికుంటల నిర్మాణం చేపట్టాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇప్పటి వరకు 550 నిర్మాణం పూర్తి చేశాం. గడువులోగా లక్ష్యాన్ని అధిగమించేందుకు ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. 9వేల నీటి కుంటల నిర్మాణం పూర్తిచేస్తే టీఎంసీ నీటిని నిల్వ చేసుకునే అవకాశం జిల్లాకు లభిస్తుంది.

ప్రశ్న: ఇప్పటి వరకు ఈ ఆర్థిక సంవత్సరంలో ఎన్ని ఉపాధి పనిదినాలు కల్పించారు?

జవాబు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1.13 కోట్ల పని దినాలు లక్ష్యం పెట్టుకోగా... ఇప్పటి వరకు 1.10కోట్ల పని దినాలు పూర్తి చేశాం. కనీస వేతనం రూ.265 కాగా.. ప్రస్తుతం రూ.263 చొప్పున జమవుతోంది. ప్రస్తుతం పండుగల కారణంగా కొద్దిగా పనిదినాలు తగ్గాయి.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని జాబ్‌కార్డులు ఉన్నాయి.. ఎంతమంది కూలీలు ఉన్నారు...?

జవాబు: జిల్లాలో 3.14 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇందులో 4.66 లక్షల మంది కూలీలు ఉన్నారు. ఎస్సీలకు సంబంధించి 89వేల జాబ్‌కార్డులు ఉండగా.. 1.10 లక్షల మంది కూలీలు ఉన్నారు. 10వేలు ఎస్టీ జాబ్‌కార్డులు ఉండగా.. 20వేల మంది కూలీలు ఉన్నారు. మొత్తంగా 3 లక్షల మంది మహిళా కూలీలు ఉన్నారు. 59వేల జాబ్‌కార్డులకు వందరోజుల పనిదినాలు లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 19వేల జాబ్‌కార్డులకు పూర్తి చేశాం.

● వేసవి రాకతో డిమాండ్ ● చల్లటి తాగునీటి కోసం కొనుగోలు ● ఎన్నెన్నో ఆరోగ్య ప్రయోజనాలు

కు(ఎ)ండల కాలం

వేసవి వచ్చింది. ఎండలు మండిపోతున్నాయి. కాసిన్ని చల్లనీరు తాగాలని ప్రతిఒక్కరూ కోరుకుంటారు. ఫ్రిజ్‌లోని నీరు తాగుతుంటారు. ఇటీవలిగా చల్లని మట్టి కుండలోని నీరు తాగేవారి సంఖ్య పెరుగుతోంది. కుండలోని నీటితో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయని నిపుణులు సూచిస్తున్నారు. దీంతో కుండలోని నీరు తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో మట్టి కుండలకు డిమాండ్ పెరిగింది. ఎటుచూసినా.. మట్టి కుండలు దర్శనమిస్తున్నాయి.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టి కుండలు

హిందూపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఏ ఇంట్లో చూసినా మట్టి కుండ ఉండేది. చెలిమ నుంచి నీరు పట్టుకుని రావడం మొదలుకుని నిలువ ఉంచడానికి అన్నింటికీ మట్టి కుండలనే వినియోగించేవారు. ఓ రకంగా చెప్పాలంటే అప్పట్లో ప్రతి ఇంట్లో కుండ నిత్యవసర వస్తువు. పండుగ సమయాల్లో కచ్చితంగా మట్టిపాత్రలు కొత్తవి కొనుగోలు చేసేవారు. అందులోనే వంటలు వండి ఆరగించేవారు. మారిన కాలానుగుణంగా మట్టి కుండలకు ఆదరణ తగ్గుతూ వచ్చింది. ఒకానొక దశలో మట్టి కుండలు కొనేవారు, వాడేవారు లేకుండాపోయారు. కొన్నేళ్లుగా పరిస్థితుల్లో మార్పు వస్తోంది. ప్రతి వ్యక్తి ఆరోగ్యంపై దృష్టి పెడుతున్నారు. మట్టి పాత్రలు ఆరోగ్యానికి ఎంతో మేలు అని నిపుణులు సూచిస్తున్నారు. దీంతో మళ్లీ మట్టి పాత్రల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో మట్టి కుండలు దర్శనమిస్తున్నాయి. ఫ్రిడ్జ్ నీటికంటే మట్టికుండలో నీరే ఆరోగ్యానికి మంచిదని నిపుణులు, వైద్యులు చెబుతున్నారు. దీంతో వేసవిలో వీటికి గిరాకీ పెరిగింది.

ఆరోగ్యానికి మేలు

మట్టికుండలోని నీరు తాగితే ఆరోగ్యానికి ఎంతో మేలు చూకూరుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. గొంతునొప్పి, జలుబు, ఇతరత్రా వ్యాధులు నివారించవచ్చని చెబుతున్నారు. మట్టి కుండలో నీరు తాగడం ద్వారా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి.

చలివేంద్రాల్లో ఇవే..

వేసవి ప్రారంభం కావడంతో పట్టణాల్లో చాలాచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తుంటారు. పెద్దపెద్ద కుండలు ఉంచి కొన్నిచోట్ల మజ్జిగ, మరికొన్నిచోట్ల నీరు ఉంచి బాటసారులు, ప్రయాణికులకు అందిస్తుంటారు. దీంతో మట్టికుండలకు గిరాకీ పెరిగింది. పెద్దపెద్ద పట్టణాలు, నగరాల్లో సైతం మట్టికుండలు, బిందెలు, కూజాల విక్రయాలు పెరిగాయి. ప్రస్తుతం జనాల అవసరాలకు తగ్గట్టుగా వీటికి ట్యాప్‌లు బిగించి, అమ్ముతున్నారు. 5 లీటర్లు మొదలుకుని 30 లీటర్ల కుండలు అందుబాటులో ఉన్నాయి. మార్కెట్‌లో వీటి ధరలు రూ.100 నుంచి 500దాకా పలుకుతున్నాయి. వేసవి కావడంతో పది శాతం ధరలు పెంచినట్లు తెలుస్తోంది.



వేసవిలోనే అమ్మకాలు



వేసవి కాలంలో, ఎండలు అధికంగా ఉన్న సమయంలోనే మట్టి కుండలు అమ్మకాలు బాగుంటాయి. మిగిలిన రోజుల్లో రెండు మూడు కుండలు కూడా అమ్ముడుపోవు. ఈ మూడు నెలలు వేసవిలో రోజుకు 20 నుంచి 30 కుండలు అమ్ముడవుతాయి.

-పిల్లప్ప, కుండల వ్యాపారి

తప్పనిసరిగా కొంటాం..



ఇరవై ఏళ్ల క్రితం ప్రతి ఇంట్లోనూ మట్టి కుండలు ఉండేవి. ధాన్యం నిల్వకు కూడా వీటిని ఉపయోగించేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కానీ వేసవిలో తప్పనిసరిగా కుండలను వాడుతున్నాం. ఫ్రిజ్ నీళ్లకంటే కుండల్లో నీరే ఆరోగ్యానికి మంచిదని మా పెద్దలు చెప్పేవారు.

- నాగన్న, కగ్గల్లు

ఏళ్లుగా కుండ నీరే..



ప్రతి సంవత్సరం వేసవిలో తప్పనిసరిగా తాగునీటి కోసం కొత్తకుండలు కొనుగోలు చేస్తాం. మారిన కాలానికి అనుగుణంగా కొళాయి ఉన్న కుండలని తీసుకెళ్తున్నాం. ఎర్రటి మట్టి కుండలో నీరు చాలా చల్లగా ఉంటుంది.



- రహంతుల్లా, మేళాపురం



మొండిగోడలకు పరిమితమైన ఇండోర్ స్టేడియం





శిథిలావస్థకు చేరిన పశువుల ఆసుపత్రి భవనం

ఎన్నేళ్లకు పూర్తవుతాయో..?

- ఆగిన ప్రభుత్వ భవన నిర్మాణాలు
- ప్రారంభం కాక మునుపే నెర్రెలు చీలిన గోడలు
- దాదాపు రూ.5కోట్ల ప్రజాధనం వృథా
- పట్టించుకోని అధికారులు

తాడిపత్రి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వివిధరకాల ప్రభుత్వ భవన నిర్మాణాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. నిర్మాణాలు పూర్తికాక మునుపే గోడలు నెర్రెలు చీలడం, బండపరుపు దెబ్బతినడం వంటివి జరుగుతున్నాయి.పట్టణంలోని శ్రీనివాసపురంలో పశువుల ఆసుపత్రితో పాటు ల్యాబ్ నిర్మాణానికి దాదాపు రూ.80లక్షలు నిధులు మంజూర య్యాయి. నిధులు మొత్తం ఖర్చు చేసి నిర్మాణం దాదాపు పూర్తిచేశారు. మిగిలిన పనులు పూర్తిచేయడానికి ఇంకా రూ.20 లక్షల మేర నిధులు కావాల్సి ఉండగా గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నూతన భవనం శిథిలావస్థకు చేరింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో యువతకు క్రీడల్లో నైపుణ్యం పెంచాలన్న ఉద్దేశంతో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో రూ.2కోట్ల వ్యయంతో చేపట్టిన నిర్మాణ పనులు మొండిగోడలకే పరిమితమయ్యాయి. చిన్నబజారులోని పాతకూరగాయల మార్కెట్ సమీపంలో రూ.26లక్షల వ్యయంతో చేపట్టిన షాదీఖానా భవన నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోవడంతో వృథాగా మారి ఆ స్థలంలో పిచ్చిమొక్కలు, కంపచెట్లు ఏపుగా పెరిగాయి. పాతకోటలో రూ.80లక్షలతో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం నిధుల లేమితో మధ్యలోనే ఆగిపోయింది. నిర్మాణం పూర్తికావాలంటే మరో రూ.40లక్షలు కావాల్సి ఉంటుంది. ఉపకేంద్రం నిర్మాణం పూర్తయితే స్థానికులకు ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయి. వీటిపై పాలకులు దృష్టిపెడితే బాగుంటుందని స్థానికులు చర్చించు కుంటున్నారు.

రూ.5 కోట్ల ప్రజాధనం వృథా

ప్రజలకు సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలన్న తలంపుతో గత టీడీపీ ప్రభుత్వం భవనాల నిర్మాణాల కోసం విడుదల చేసిన రూ.5కోట్లు వృథాగా మారాయి. నిధులు తక్కువగా ఉన్న వాటికి అదనపు నిధులు ఇవ్వడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. దాదాపు ఎనిమిదేళ్లు అవుతుండటంతో భవనాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో ప్రజాధనం వృథాగా మారింది. ఇప్పటికైనా అధికారులు తగు చొరవ చూపి భవనాల నిర్మాణాలు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.

ప్చ్...ఉపయోగం లేదు

మూగజీవాలకు తప్పని నీటి కష్టాలు

పామిడి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వేసవిలో మనుషులకే కాదు మూగజీవాలకు తాగునీటి తిప్పలు తప్పడం లేదు. భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటిపోవడంతో వ్యవసాయ బోర్లతో పాటు గ్రామాల్లోనూ నీటి పథకాల బోర్లు, చేతి పంపుల్లో నీళ్లు అడుగంటిపోయాయి. మండలంలోని చెరువులు, కుంటలు, బావులలో నీరు ఇంకిపోతోంది. ఒకవైపు గ్రాసం కొరత మరోవైపు దాహార్తితో పశువులు అలమటిస్తున్నాయి. దీంతో తమ పశువులను ఎలా బతికించుకోవాలో తెలియడం లేదని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో దాదాపు గేదెలు 9400లు, గొర్రెలు, మేకలు 41000, కోళ్లు 11000 ఉన్నట్లు పామిడి ప్రభుత్వ పశువైద్యాధికారిణి ఉషాకిరణ్ పేర్కొన్నారు. ఈ మూగజీవాలకు వేసవిలో నీరందించలేక రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

నిరుపయోగంగా నీటి తొట్టెలు
పట్టించుకోని అధికారులు
ఆందోళనలో పాడి రైతులు



దేవరపల్లిలో కంపచెట్లలో నిరుపయోగంగా ఉన్న పశువుల నీటితొట్టె

నీటి తొట్లు వృథా

మండలంలోని దేవరపల్లి, సొరకాయలపేట, అనుంపల్లి, దిబ్బసానిపల్లి, ఖాదర్‌పేట, రామగిరి, ఎదురూరు తదితర గ్రామాలలో రూ.వేలాది ప్రజాధనం వెచ్చించి పశువుల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెలను నిర్మించారు. నిర్వహణ కరువవడంతో నీటి తొట్టెలు నిరుపయోగంగా మారాయి. కొన్ని గ్రామాల్లో రెండు నీటి తొట్టెలను నిర్మించారు. తొట్టెలను నిర్మించి నిధులు కాజేశారే తప్ప పశువుల దాహార్తిని తీర్చలేకపోయారని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో నీటి తొట్టెలు ధ్వంసమయ్యాయి. దిబ్బసానిపల్లి, కట్టకిందపల్లి గ్రామాల్లో నీటి తొట్టెలలో నీరు ఉండటంతో మూగజీవులకు దాహార్తి తీరుతోంది. నిర్మించిన నీటి తొట్టెలకు బోరుబావులు, ట్యాంకర్ల ద్వారా నీటిని నింపి పశువుల దాహార్తిని తీర్చాల్సిన అవసరం ఉంది. అధికారులు స్పందించి నీటి తొట్టెలను నీటితో నింపాలని రైతులు కోరుతున్నారు.

కలచివేస్తోంది: సుదర్శన్‌బాబు, పాడిరైతు, రామగిరి



వేసవిలో మూగజీవాల రోదన పాడి రైతులను ఎంతగానో కలచివేస్తోంది. గ్రామంలో నీటి తొట్టెను నిర్మించి చేతులు దులుపుకున్నారు. తొట్టెను నీటితో నింపిన పాపానపోలేదు. ఎన్నో పశువులు వేసవిలో దాహం తీర్చుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నాయి. మూగజీవాలను చూస్తే కడుపు తరుక్కుపోతోంది. అధికారులు చొరవ తీసుకొని నీటితొట్టెలను వినియోగంలోకి తేవాలి.

నీటి తొట్టె నిర్మించాలి




రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ పాడి రైతులకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోంది. పాడి రైతులకు అధికారులు ఏ పథకాలుపైన ఎలాంటి సమాచారమూ ఇవ్వరు. ఈ వేసవిలో పశువులు దాహార్తి తీర్చడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాం. పశువుల కోసం నీటితొట్టెలను నిర్మిస్తే చాలా బాగుంటుంది. పశువులు, పాడిరైతులను పట్టించుకునే వారేలేరు.

-రాఘవేంద్ర, పాడిరైతు, నీలూరు

పీఏబీఆర్‌లో అడుగంటిన నీరు





చెర్లోపల్లి రిజర్వాయర్

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండుతున్న వేసవికి ఉమ్మడి జిల్లాలోని జలాశయాలు అడుగంటిపోతున్నాయి. ఆయా రిజర్వాయర్లలో ఇప్పటికే నీటి నిల్వలు కనిష్ఠస్థాయికి చేరాయి. జలవనరుల శాఖ ఇంజనీర్లు మాత్రం నీటి నిల్వలు తాగునీటి అవస రాలకు అనుగుణంగా ఉన్నాయని చెబుతున్నా రిజర్వాయర్లలో ఆ స్థాయిలో నీటి నిల్వలు లేవని తెలుస్తోంది. రెండు జిల్లాల కలెక్టర్లు, యంత్రాంగంతో సమన్వయం చేసుకుని నీటి నిల్వ, వేసవిలో తాగునీటి అవసరాలను బేరీజు చేసుకుని సమస్య తలెత్తకుండా చూడాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు ప్రధానం గా శ్రీశైలం డ్యాం నుంచి హంద్రీనీవా ద్వారా, టీబీ డ్యాం నుంచి హెచ్చెల్సీ ద్వారా జిల్లాకు సాగు, తాగునీరు అందుతున్నాయి. ఇప్పటికే శ్రీశైలం, టీబీ డ్యాం నుంచి నీటి సరఫరాను నిలిపివేశారు. ఈ నేపథ్యం లో ఉమ్మడి జిల్లాలోని రిజర్వాయర్లలో నిల్వ ఉన్న నీటిని కాపాడుకుం టూ...పొదుపుగా నీటిని వినియోగించుకోవడంపైనే దృష్టి సారించాలని నిపుణులు సూచిస్తున్నారు.

- అడుగంటుతున్న జలాశయాలు
- వేసవి నీటి ఎద్దడిపై ఆందోళన
- ఎండ తీవ్రతతో ఆవిరవుతున్న జలాలు
- పొంచి ఉన్న నీటి గండం


వేగంగా..!

జీడిపల్లి రిజర్వాయర్‌లో పడిపోయిన నీటి నిల్వ



ఉమ్మడి జిల్లాలో జలాశయాల్లో నీటి నిల్వల పరిస్థితి

జిల్లాలోని రిజర్వాయర్లు.. వాటి సామర్థ్యం.. ప్రస్తుత నీటి నిల్వలను పరిశీలిస్తే.. హంద్రీనీవా కింద జీడిపల్లి 1.68టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 1.490టీఎంసీల నీటి నిల్వ ఉంది. గొల్లపల్లి 1.913టీఎంసీలు కెపాసిటీ కాగా ప్రస్తుతం 1.180టీఎంసీలు, మారాల 0.483టీఎంసీలు సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 0.250టీఎంసీలు, చెర్లోపల్లి 1.608 టీఎంసీలు సామర్థ్యం కాగా ప్రస్తుతం 1.410టీఎంసీల నీరు నిల్వ ఉంది. పేరూరు డ్యాం 1.810టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 0.450టీఎంసీలు, భైరవానితిప్ప ప్రాజెక్ట్ 2.1టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 0.510టీఎంసీల నీరు ఉంది. హెచ్చెల్సీ కింద చాగల్లు రిజ ర్వాయర్ 1.5టీఎంసీలుగా కాగా ప్రస్తుతం 0.660టీఎంసీలు, పెండేకల్లు 0.655టీఎంసీలుగా కాగా ప్రస్తుత 0.198టీఎంసీలు, పెనకచెర్ల డ్యాం (ఎంపీఆర్) 5.200టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 0.795టీఎంసీలు, పీఏబీఆర్ డ్యాం 11.10టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 2.174టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది.



గొల్లపల్లి రిజర్వాయర్

ఎండల తీవ్రత సాధారణం కంటే అధికం

ఈ ఏడాది సాధారణం కంటే ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరించింది. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం జలవనరుల పరిస్థితి బా గానే ఉందని అధికారులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం వేసవి తీవ్రత పెరగడంతో జలాశయాల్లో నీరు వేగంగా అడుగంటి పోతుండటం ఆందోళన కలిగించే అంశం. ఈ నేపథ్యంలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం కల్పిస్తూ స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ తాగునీటి సరఫరా చేయడంపైనే దృష్టి పెట్టారు. ఇప్పటికే పలుమార్లు నీటి నిల్వలు, తాగునీటి అవసరాలపై రెండు జిల్లాల కలెక్టర్లతో జలవనరుల శాఖ ఇంజనీర్లు సమీక్షించి అంచనాలపై చర్చించారు. ఉమ్మ డి జిల్లాల కలెక్టర్లు, జిల్లాల యంత్రాంగంతో జలవనరుల శాఖ అధికారులు, ఇంజనీర్లు సమన్వయం చేసుకుంటూ రిజర్వాయర్లలో నీటి నిల్వపై అంచనా వేస్తున్నారు.

తాగునీటికి ఇబ్బంది లేదు: నాగరాజ, జలవనరుల శాఖ ప్రాజెక్టుల సీఈ



వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి అవసరాలకు అనుగుణంగా రిజర్వాయర్లలో నీటి నిల్వలు ఉంచాం. వేసవి తీవ్రత అధికంగా ఉండటంతో జలాశయాల్లో నీరు వేగంగా ఆవిరి అవుతూ, భూమిలోకి ఇంకిపోతోంది. ఇది కొంత మేర ఆందోళన కలిగించినా... జూన్, జూలై నెల వరకు తాగునీటికి ఎక్కడా ఇబ్బంది రాకుండా అందించేందుకు రిజర్వాయర్లలో నీటి లభ్యత ఉంది. ఇప్పటికే రెండు జిల్లాల కలెక్టర్లు, యంత్రాంగానికి తాగునీటి అవసరాలకు అనుగుణంగా ఆయా రిజర్వాయర్లలో ఉన్న నీటి నిల్వలు, ప్రణాళికలపై చర్చించాం. ఎక్కువగా అనంతపురం, హిందూపురానికి నీటిని ఇవ్వాలని సూచించారు. అందుకు అనుగుణంగా మా ఇంజనీర్లకు నీటి సరఫరాపై పలు సూచనలు ప్రభుత్వం ఇచ్చింది. ప్రణాళిక ప్రకారమే తాగునీటిని సరఫరా చేస్తాం.

తిరుపతి ప్యాసింజరు పాక్షిక పునరుద్ధరణ

గుంతకల్లు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కుంభమేళా నేపథ్యంలో రద్దయిన తిరుపతి-కదిరిదేవరపల్లి ప్యాసింజరు రైలును రైల్వే అధికారులు పాక్షికంగా పునరుద్ధరించారు. 1వ తేదీ సాయంత్రం కదిరిదేవరపల్లి-తిరుపతి ప్యాసింజరు (నం. 57406) రైలును గుంతకల్లు నుంచి ప్రారంభించారు. ఈ రైలును డిసెంబరు 28వ తేదీ నుంచి రద్దుపరచి ప్రయాగరాజ్ కుంభమేళాకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం పంపారు. ఈ రైలు గతనెల 1వ తేదీనే పునఃప్రారంభం కావాల్సి ఉండగా, కుంభమేళా నుంచి భక్తులను స్వస్థలాలకు తరలింపు కార్యక్రమం కోసం ఆ తేదీని మార్చి నెలాఖరుకు వాయిదా వేశారు. మార్చి 27వ తేదీకి తిరుపతి ప్యాసింజరు రైళ్లు డివిజన్ కేంద్రానికి చేరగా, యార్డులో నిలిపి ఉంచారు. ఈ రైళ్లను ఎప్పుడు ప్రారంభించనున్నారో రైల్వే అధికారులు ముందుగా ప్రకటించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చెప్పాపెట్టకుండా ప్యాసింజరు రైలును కదిరిదేవరపల్లి నుంచి కాకుండా గుంతకల్లు నుంచి తిరుపతికి పాక్షికంగా పునరుద్ధరించారు. మెయింటెనెన్స్ పనుల కారణంగా కదిరిదేవరపల్లి-గుంతకల్లు సెక్షన్‌లో రైలును పాక్షికంగా రద్దుపరచి గుంతకల్లు-తిరుపతి సెక్షన్‌లో తిరిగేలా రెన్యూవల్ చేశారు. అలాగే తిరుపతి-గుంతకల్లు-తిరుపతి ప్యాసింజరు (నం. 57403/04) రైలును కూడా పునరుద్ధరించారు. కిందటి వారమే తిరుపతి-హుబ్లీ-తిరుపతి ప్యాసింజరు (నం. 57401/02) రైలును పునరుద్ధరించారు.

హత్య కేసులో జీవిత ఖైదు

అనంతపురం క్రైం, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళను చంపిన కేసులో ముద్దాయికి జీవిత ఖైదు పడింది. నార్పల మండలం బండ్లపల్లి (ప్రస్తుత నివాసం అనంతపురం నగర శివారులోని నందమూరినగర్)కు చెందిన దూదేకుల సిద్దయ్యకు జీవిత ఖైదు, రూ.10వేల జరిమానా విధిస్తూ మహిళా కోర్టు న్యాయాధికారి శోభారాణి బుధవారం తీర్పు వెలువరించారు. కేసు వివరాలిలా ఉన్నాయి. దూదేకుల సిద్దయ్య అప్పటికే వివాహమైన వడ్డే రామాంజినమ్మతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆమె తనను పెళ్లి చేసుకోమని సిద్దయ్యను బలవంతం పెట్టింది. ఆ క్రమంలో 2014 ఫిబ్రవరి 25న సిద్దయ్య.. రామాంజినమ్మను ఇంద్రజిత్‌నగర్‌లోని కంపచెట్లలోకి తీసుకెళ్లి, చంపేశాడు. ఆమె మెడలోని ఐదుతులాల బంగారు నగలు, రూ.3వేల నగదు తీసుకుని పరారయ్యాడు. ఆ నగలను బ్యాంకు, ఫైనాన్స్ సంస్థలో తాకట్టుపెట్టి, వచ్చిన సొమ్ముతో ఆటో కొనుక్కుని జీవనం సాగించసాగాడు. రామాంజినమ్మ హత్యపై ఆమె భర్త రవి అనంతపురం మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి సీఐ దేవానంద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. సిద్దయ్యను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో 8 మంది సాక్షులను కోర్టు విచారించింది. సిద్దయ్యపై నేరం రుజువు కావడంతో జీవితఖైదు, రూ.10వేల జరిమానా విధించింది. ముద్దాయికి శిక్షపడేలా చేసిన సిబ్బందిని ఎస్పీ జగదీష్ అభినందించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


రూపానాయక్ (ఫైల్)

ఉరవకొండ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లి పెద్దతాండాలో రూపానాయక్(25) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. అతడి బంధువులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణానాయక్, కమలమ్మ దంపతుల కుమారుడు రూపానాయక్ నిర్మిస్తున్న ఇంటి గోడకు నీరు పడుతుండగా.. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు లోనయ్యాడు. హుటాహుటిన అతడిని ఉరవకొండ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. రూపానాయక్‌కు వివాహం కాలేదు. ఎస్ఐ నాగస్వామి ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి..

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు-డోన్ రైలు మార్గంలోని మండలంలోని మల్లప్పగేట్ సమీపాన రైలు ఢీకొని 35 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి బుధవారం మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ..


ఆవుల గోపాల్ (ఫైల్)

గోరంట్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం సమీపాన రాణి స్టీల్ ఎస్టేట్ వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆవుల గోపాల్ (38) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు సీఐ శేఖర్ తెలిపారు. వడిగేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన ఆవుల గోపాల్ మంగళవారం రాత్రి ద్విచక్రవాహనంపై పాలసముద్రం నుంచి బెంగుళూరు వైపు వెళ్తూ రోడ్డు పక్కన ఆపివున్న కంటైనర్ లారీని ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని హిందూపురం తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. గోపాల్‌కు భార్య పుష్ప ఉంది. ప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

హౌసింగ్‌లో అక్రమాలపై కొరడా

ఇద్దరు ఏఈల తొలగింపు... డీఈకి షోకాజ్ నోటీసులు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో రాప్తాడు నియోజకవర్గంలో హౌసింగ్‌లో అక్రమాలపై జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో రాప్తాడు నియోజకవర్గంలో ఇనుము, సిమెంటు అక్రమంగా విక్రయించుకుని సొమ్ము చేసుకున్న వ్యవహారంపై కొరడా ఝుళిపించారు. అప్పట్లో రాప్తాడు నియోజకవర్గం ఆత్మకూరులో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఏఈ అనిల్ రూ.2లక్షలు, రాప్తాడు ఏఈ పవన్‌కుమార్ రూ.56 లక్షలు స్వాహా చేసినట్లు విచారణలో తేలింది. రాప్తాడు హౌసింగ్ ఏఈ పవన్‌కుమార్‌ను ఉద్యోగం నుంచి తొలగించడంతోపాటు క్రిమినల్ కేసు నమోదు, దుర్వినియోగం చేసిన రూ.56లక్షల సొమ్ము రికవరీ చేయాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆత్మకూరు ఏఈ అనిల్ నుంచి రూ.2లక్షలు రికవరీ చేసి, విధుల నుంచి పూర్తిగా తొలగించినట్లు తెలిపారు. అప్పట్లో డీఈగా పనిచేసిన ప్రస్తుత శింగనమల ఇన్‌చార్జి డీఈ రామమూర్తికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు హౌసింగ్ పీడీ శైలజ తెలిపారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

గార్లదిన్నె, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఏపీఆర్ఎస్ మైనార్టీ గురుకుల విద్యాలయ ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ ఆంజనేయులు నాయక్ బుధవారం ప్రకటనలో తెలిపారు. 2025-2026 విద్యాసంవత్సరానికి ఏపీఆర్ఎస్ మైనార్టీ గురుకుల ప్రవేశాల దరఖాస్తు గడువు గతనెల 30వ తేదీతో ముగిసిందన్నారు. దానిని ఈనెల 6వ తేదీ వరకు పొడిగించారన్నారు. ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 6, 7, 8 తరగతుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు.


పోలీస్ శాఖలో పలువురు వీఆర్‌కు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బుధవారం ఓ హెడ్‌కానిస్టేబుల్, తొమ్మిది మంది కానిస్టేబుళ్లు, ముగ్గురు హోంగార్డులను వీఆర్‌కు పంపారు. ఆంధ్రజ్యోతిలో గత నెల 19న వెలువడిన 'సింహం గడ్డి మేస్తే' అనే కథనానికి పోలీస్ ఉన్నతాధికారులు స్పందించారు. అనంతపురంలో ఇద్దరు కానిస్టేబుళ్లు, ఇద్దరు హోంగార్డులను, గుంతకల్లులో ఓ హెడ్‌కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లను, కళ్యాణదుర్గం, ఉరవకొండ, శింగనమల పరిధిలో మరో ఐదుగురు కానిస్టేబుళ్లు, ఇద్దరు హోంగార్డులను వీఆర్‌కు తీసుకొచ్చారు. అయితే సీఐ, ఎస్ఐల స్థాయి అధికారులపై కాకుండా కింది స్థాయి సిబ్బందిపైనే చర్యలు తీసుకుంటున్నారన్న విమర్శ లు వినిపిస్తున్నాయి. విడతల వారీగా చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు చెబుతున్నారు.

మెటీరియల్.. శిక్షణ.. ఫ్రీ..!

ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో నిర్వహణ
దగ్గరలోని కాలేజీలో వెంటనే చేరిపోవచ్చు..
పాలిసెట్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వ వరం


పాఠాలు బోధిస్తున్న ఫిజిక్స్ లెక్చరర్

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పాస్ అయిన విద్యార్థులకు పాలిటెక్నిక్ కళాశాల్లో ప్రవేశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి ఆధ్వర్యంలో పాలిసెట్-2025 నోటిఫికేషన్ జారీచేసింది. ఈ నెల 15వరకు దరఖాస్తులు స్వీకరించి, 30న పరీక్షలు నిర్వహిస్తారు. పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికీ ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేసి, శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ప్రతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ నెల 28 వరకు తరగతులు కొనసాగుతాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు బోధన ఉంటుంది. విద్యార్థులు సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లి, పదో తరగతి హాల్ టికెట్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అదే రోజు తరగతులకు హాజరు కావచ్చని అధికారులు తెలిపారు.

ఉచిత కోచింగ్ సెంటర్ల వివరాలు

ప్రభుత్వ కళాశాల	సెల్ నంబరు
అనంతపురం	8985703601, 9493523133
నార్పల	8096907527
తాడిపత్రి	9010222198
గుంతకల్లు	7075932669
ఉరవకొండ	9505504205
కళ్యాణదుర్గం	9505504207
రాయదుర్గం	9010222165
మడకశిర	9505504206
ధర్మవరం	9010222170
హిందూపురం	9912342058
కదిరి	9010222175

50 వేలకు పైగా అర్హులు

ఉమ్మడి జిల్లాలో 50 వేల మందికి పైగా విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. వీరందరూ పాలిసెట్‌కు అర్హులు. దీంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సంఖ్య భారీగా ఉంది. గడిచిన ఐదేళ్ల పాలిసెట్ నిర్వహణ, ఫలితాల విడుదల, కౌన్సెలింగ్.. ఇలా అన్నీ గందరగోళంగా జరిగాయి. దీంతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో ప్రవేశాల శాతం పడిపోయింది. ప్రతిభ, అనుభవం ఉన్న అధ్యాపకులు ఉన్నా.. విద్యార్థుల్లేక కళాశాలలు బోసిపోయాయి. ఒక్క అనంతపురం కళాశాల మినహా ఎక్కడా పూర్తిస్థాయి ప్రవేశాలు జరగలేదు. ఈ క్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను బలోపేతం చేసి, వందశాతం ప్రవేశాలు కల్పించేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చర్యలు చేపట్టారు. ప్రభుత్వ కళాశాలల్లోనే పాలిసెట్‌కు ఉచితంగా శిక్షణ ఇచ్చి, మెరుగైన ర్యాంకులు సాధించేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

ప్రైవేట్‌కు కళ్లెం

పబ్లిక్ పరీక్షలు ముగియగానే ఎంట్రెన్స్ టెస్ట్‌లకు శిక్షణ పేరిట ప్రైవేటు కోచింగ్ సెంటర్లు దోపిడీకి దిగడం పరిపాటిగా మారింది. ర్లకు రాష్ట్ర ప్రభుత్వం కెళ్లంవేసింది. పదో తరగతి విద్యార్థుల వివరాలు సేకరించి, తమ వద్ద చేరాలని వెంట పడుతుంటారు. పాలిసెట్ రాసేవరకు తరగతుల నిర్వహిస్తామని, భోజనం, వసతి కల్పిస్తామని ఒక్కో విద్యార్థి వద్ద రూ.15వేల నుంచి రూ.30వేల వరకు వసూలు చేస్తుంటారు. అర్హత సాధించిన విద్యార్థులను ప్రైవేటు కళాశాలలకు ప్రమోట్‌చేసి, కమీషన్లు పుచ్చుకుంటారు. ఈ దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వమే ఉచిత శిక్షణ, మెటీరియల్ ఇవ్వడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రుల్లో హర్షం వ్యక్తమౌతోంది.

సద్వినియోగం చేసుకోవాలి..



పాలిసెట్‌లో పదో తరగతి పాఠ్యాంశాలతోనే ప్రశ్నపత్రం తయారు చేస్తారు. సెక్షన్-1లో గణితం 50, సెక్షన్-2లో ఫిజిక్స్ 40, సెక్షన్-3లో కెమిస్ట్రీ 30.. ఇలా మొత్తం 120 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు ఉంటుంది. ప్రతి ప్రశ్నకు నాలుగు జవాబులు(ఏ, బీ, సీ, డీ) ఉంటాయి. సరైన సమాధానాన్ని గుర్తించి ఓఎంఆర్ షీట్‌లో ప్రశ్నకు ఎదురుగానున్న వృత్తాకారాన్ని పెన్సిల్‌తో బ్లాక్ చేయాలి. పాలిసెట్ అంటే భయపడాల్సిన అవసరంలేదు. కంగారుపడి వేలకు వేలు ఫీజులు చెల్లించి కోచింగ్ తీసుకోవడం, స్టడీ మెటీరియల్ కొనుగోలు చేయడం తల్లిదండ్రులపై భారం మోపడమే. విద్యార్థుల్లో భయాన్ని పారదోలి, సులువుగా పరీక్షలు రాసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేసి, తరగతులు నిర్వహిస్తోంది. విద్యార్థులు వారి సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లి శిక్షణ పొందవచ్చు.

- వెంకటసుబ్బయ్య, అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు

నేటి నుంచి టెన్త్ స్పాట్

- విధులకు 1250 మంది నియామకం
- కేఎస్ఆర్‌కు చేరిన 1.80 లక్షల జవాబు పత్రాలు

అనంతపురం విద్య, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పదో తరగతి జవాబు పత్రాల మూల్యాకనం గురువారం నుంచి మొదలవుతోంది. ఈ నెల తొమ్మిదో తేదీ వరకూ.. ఏడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమం కోసం 1250 మంది అధికారులు, సిబ్బందిని నియమించారు. గత నెల 17వ తేదీ నుంచి ఈ నెల ఒకటో తేదీ వరకూ పరీక్షలు జరిగాయి. పలు జిల్లాల నుంచి జవాబు పత్రాలు జిల్లాకు చేరాయి. మరో ఒకటి రెండు సబ్జెక్టుల జవాబు పత్రాలు గురు, శుక్రవారాల్లో జిల్లాకు చేరే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ఇప్పటి వరకూ వేర్వేరు జిల్లాల నుంచి 1.80 లక్షల జవాబు పత్రాలు కేఎస్ఆర్ హైస్కూల్‌లోని స్ట్రాంగ్ రూమ్స్‌కు చేరాయి. మూల్యాంకణం కోసం జిల్లా విద్యాశాఖ, పరీక్షల విభాగం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కుర్చీలు, టేబుళ్లు, ఫ్యాన్లు అందుబాటులో ఉంచారు. వీటిలో కొన్ని శిథిలావస్థలో ఉన్నాయి. పేపర్లు దిద్దేందుకు అసిస్టెంట్ ఎగ్జామినర్లు(ఏఈ), చీఫ్ ఎగ్జామినర్లు(సీఈ), స్పెషల్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందిని ఇప్పటికే నియమించారు. సుమారు 1100 మందిని రెగ్యులర్, 150 మంది వరకూ ఓపెన్ పరీక్షల స్పాట్ విధులకు కేటాయించారు. వీరందరూ క్యాంపులో గురువారం ఉదయం రిపోర్ట్ చేసుకుంటారు.

సబ్జెక్టు	ఏఈ/సీఈలు
తెలుగు	128
హిందీ	107
ఇంగ్లిష్	143
మ్యాథ్స్	150
ఫిజికల్ సైన్స్	100
బయాలజీ	101
సోషల్	92
స్పెషల్ అసిస్టెంట్లు	233
మొత్తం	1,054

(వీరు కాక.. సహాయకులు ఉంటారు)


స్పాట్ కోసం ఏర్పాటు చేసిన బెంచీలు

ఉదయమే రిపోర్ట్ చేసుకోవాలి..

పదో తరగతి మూల్యాంకనానికి రెగ్యులర్‌కు సుమారు 1100 మందిని, ఓపెన్‌కు 150 మందిని నియమించారు. స్పాట్ డ్యూటీ ఆర్డర్‌లు అందుకున్న టీచర్లు గురువారం ఉదయం 8.30 గంటలకు రిపోర్ట్ చేసుకోవాలి. దీర్ఘకాలిక వ్యాధులు, ఇతర సమస్యలు ఉన్నవారు డీఈఓ దృష్టికి, నా దృష్టికి తేవాలి. పరిశీలించి, అవకాశం ఉంటే డీఈఓ మినహాయింపు ఇస్తారు. ఇక్కడ డ్యూటీ క్యాన్సిల్ అయిన టీచర్లు విధిగా స్కూల్ డ్యూటీకి వెళ్లాలి.

- గోవింద్ నాయక్, ఏసీ

వేర్వేరుచోట్ల ఐదుగురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బుధవారం వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురు ఆత్మహత్య చేసుకున్నారు. మద్యానికి బానిసై ఇద్దరు, క్షణికావేశంలో ఇద్దరు, మనస్థాపంతో మరొకరు బలవన్మరణానికి పాల్పడ్డారు.

పరిగి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలో వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారని ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు. కోనాపురం గ్రామానికి చెందిన రామాంజినప్ప, తిప్పక్క దంపతుల కుమారుడు బాబు(26) మద్యానికి బానిసై తరచూ డబ్బు కోసం తల్లిని వేధిస్తుండేవాడు. తిప్పక్క వేరే గ్రామానికి వెళ్లడంతో బుధవారం మద్యం మత్తులో ఇంట్లోని దూలానికి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అదేవిధంగా ఊటకూరు దళిత కాలనీకి చెందిన మేకల చౌడమ్మ (74) అనే వృద్ధురాలు మనస్థాపంతో శ్మశానవాటిక సమీపంలో చెట్టుకొమ్మకు ఉరివేసుకుంది. మృతురాలికి ఐదుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

అనంతలో మహిళ

అనంతపురం క్రైం : నగర పరిధిలోని తపోవనంలో శశికుమార్, లక్ష్మీ(33) దంపతులు నివాసం ఉంటున్నారు. శశికుమార్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. వీరికి మూడేళ్ల కుమార్తె, పది నెలల పాప ఉన్నారు. మంగళవారం రాత్రి పిల్లలతో కలిసి దంపతులు ఒకే గదిలో పడుకున్నారు. బుధవారం ఉదయం శశికుమార్ లేచి చూసేసరికి లక్ష్మీ కనిపించలేదు. రెండోగదిలో ఉరికి వేలాడుతున్న కనిపించింది. వెంటనే కిందకు దింపి ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులు మందలించారని యువకుడు..


మనోజ్ (ఫైల్)

పెనుకొండ రూరల్ : తల్లిదండ్రులు మందలించారని మనస్థాపంతో మనోజ్ (24) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రొద్దం మండలం కందుకూర్లపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వడ్డిరాజు, తిప్పక్క దంపతుల కుమారుడు మనోజ్ కియా పరిశ్రమలో పని చేస్తుండేవాడు. మంగళవారం రాత్రి అతిగా మద్యం సేవించి ఇంటికి రావడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్థాపానికిగురైన మనోజ్ రాత్రి 10గంటల సమయంలో ఇంటి సమీపంలో పాడుబడిన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ కాంతప్ప తెలిపారు.

గొర్రెల కాపరి..

ఆత్మకూరు: మండల పరిధిలోని గొరిదిండ్ల గ్రామ సమీపాన ముట్టాల పొలాల వద్ద బుధవారం ఓ గొర్రెలకాపరి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బ్రహ్మసముద్రం మండలం ముప్పలకుంట గ్రామానికి చెందిన వన్నూరుస్వామి (19) అనే యువకుడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గొర్రెలు మేపేందుకు వచ్చి ఆత్మహత్యచేసుకోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

జిరసం కార్యవర్గం ఎంపిక

అధ్యక్షుడిగా కొత్తపల్లి సురేష్


కొత్తపల్లి సురేష్, జిరసం అధ్యక్షుడు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లా రచయితల సంఘం (జిరసం)కు నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. బుధవారం ఉపాధ్యాయ భవన్‌లో జెన్నె ఆనంద్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీనియర్ రచయిత శాంతినారాయణ నేతృత్వంలో జిరసం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నూతన అధ్యక్షుడుగా వర్ధమాన కవి కొత్తపల్లి సురేష్, ప్రధాన కార్యదర్శిగా కోటిగారి వన్నప్ప, కోశాధికారిగా మధురశ్రీను ఎంపిక చేశారు. కార్యక్రమంలో సీనియర్ రచయితలు ఏలూరు యంగన్న, డాక్టర్ రాధేయ, తూముచర్ల రాజారాం, ఉప్పరపాటి వెంకటేశులు, విద్యావతి, గోసల నారాయణస్వామి, ఎల్ఆర్ వెంకటరమణ, డాక్టర్ అంకె శ్రీనివాస్, చేగువేరా హరి, ఒంటెద్దు రామలింగారెడ్డి, విశ్వనాథరెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ

అనంతపురం టౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో జేసీని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ తదితరులు కలిశారు. జేసీ మాట్లాడుతూ.. ప్రతి గ్రంథాలయం రోజూ పాఠకులకు అందుబాటులో ఉండాలన్నారు.

ఆణిముత్యాలకు చేయూత

- పేదవిద్యార్థులకు సాయం
- పారదర్శకంగా ఎంపిక
- కలెక్టర్ వినోద్‌కుమార్


అనంత ఆణిముత్యాలపై సూచనలు ఇస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్న పేద విద్యార్థులకు సహాయం అందించడమే అనంత ఆణిముత్యాలు ఆశయమని కలెక్టర్ వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారం అనంత ఆణిముత్యాల అమలు, ఆర్థిక సాయం మంజూరు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాగా చదువుకుంటూ ఆర్థికంగా వెనుకబడిన ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు సాయం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో గుర్తించి ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, దివ్యాంగుల పిల్లలకు అవకాశం కల్పించాలన్నారు. పోక్సో కేసు బాధితులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కలెక్టర్ చైర్మన్‌గా, జాయింట్ కలెక్టర్ వైస్ చైర్మన్‌గా, డీఆర్వో ప్రధాన కార్యదర్శిగా అనంత ఆణిముత్యాలు ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ 2008 నుంచి జిల్లాలో కొనసాగుతోందని తెలిపారు. దీని ఆశయం నెరవేర్చడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో జేసీ శివనారాయణశర్మ, డీఆర్ఓ మలోల, డీఈఓ ప్రసాద్ బాబు, ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజ, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, సంక్షేమశాఖల అధికారులు పాల్గొన్నారు.

రీసర్వే వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలి: కలెక్టర్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేకి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం తొలుత అదనపు సీసీఎల్ఏ ప్రభాకరరెడ్డి.. జిల్లాల కలెక్టర్లతో రీసర్వే, ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్, ఫిర్యాదుల-పరిష్కారాలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కలెక్టర్.. జిల్లా అధికారులతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో రీసర్వే వివరాలను ఎప్పటికపుడు మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. రెండో విడత రీసర్వేకి ఎంపికచేసిన రెండు గ్రామాల్లో పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. తహసీల్దార్, డీటీ, ఆర్ఐని ఎంపి చేసి, వారికి ఈ పనులు అప్పగించాలని డీఆర్వో, సర్వే ఏడీని కలెక్టర్ ఆదేశించారు.

ఎడారీకరణ నివారణపై అధ్యయనం

రాజస్థాన్‌కు డ్వామా అధికారుల బృందం
రేపట్నుంచి నాలుగు రోజుల పర్యటన

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఎడారీకరణ నివారణపై అధ్యయనానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున డ్వామా పీడీ సలీం బాషా నేతృత్వంలోని బృందం రాజస్థాన్‌కు వెళ్లనుంది. ఈనెల 4నుంచి రాజస్థాన్ రాష్ట్రం జోధ్‌పూర్‌లో పర్యటించనున్నారు. ఆ ప్రాంతంలోని ఎడారి పరిసర ప్రాంతాల్లో డ్వామా పీడీ సలీంభాషా, కణేకల్ ఏపీఓ సుధాకర్, బొమ్మనహాళ్ ఈసీ రాజేష్, దర్గాహొన్నూరు గ్రామ రైతు ముక్కన్న, కణేకల్లు మండలం నాగేపల్లి రైతు వెంకటేష్ నాలుగు రోజుల పాటు పర్యటించనున్నారు. ఎడారీకరణ నివారణకు అక్కడ తీసుకుంటున్న చర్యలు, ఉపాధి పథకం అమలు చేస్తున్న తీరు, సాగుచేస్తున్న పంటలు, నీటి నిల్వ తదితరాలను పరిశీలించనున్నారు. ఆ మేరకు ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నారు.

సెలవులో హౌసింగ్ పీడీ

ఇన్‌చార్జిగా పంచాయతీరాజ్ ఎస్ఈ జహీర్ అస్లాం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కంటి శస్త్రచికిత్స కోసం 15రోజుల పాటు హౌసింగ్ పీడీ శైలజ సెలవులో వెళ్లనున్నారు. దీంతో పంచాయతీరాజ్ ఎస్ఈ జహీర్ అస్లాంకు ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మొదట పంచాయతీరాజ్ ఎస్ఈ జహీర్ అస్లాం హౌసింగ్ పీడీగా అదనపు బాధ్యతలు స్వీకరించేందుకు విముఖత చూపారు. కలెక్టర్ ఆదేశాలతో ఎట్టకేలకు జహీర్‌అస్లాం అంగీకరించారు. గురువారం హౌసింగ్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

89 మంది కానిస్టేబుళ్ల బదిలీ


కానిస్టేబుళ్ల కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పోలీస్ కానిస్టేబుళ్ల బదిలీలు నిర్వహించారు. పారదర్శకత, నిబంధనలే ప్రామాణికాలుగా తీసుకుని సీనియార్టీ ఆధారంగా సిబ్బంది కోరుకున్న చోటుకే స్థాన చలనం చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఎస్పీ జగదీష్ తన చాంబర్లో 89 మంది కానిస్టేబుళ్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఒకే పోలీస్‌స్టేషన్‌లో ఐదేళ్లు పూర్తి చేసుకున్న సిబ్బంది జాబితాను సిద్ధం చేసి కౌన్సెలింగ్‌కు పిలిచారు. పట్టణాల్లో పనిచేస్తున్న వారిని రూరల్ పోలీస్‌స్టేషన్లకు, రూరల్ ప్రాంతాల వారిని పట్టణ పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి, జిల్లా పోలీస్ కార్యాలయం ఏఓ రవిరాంనాయక్, పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులునాయుడు, హరినాథ్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

9న మెగా వైద్యశిబిరం

తాడిమర్రి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాలలో ఈ నెల 9న మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యసిబ్బంది తెలిపారు. ఆరోగ్యం బాగా లేనివారికి, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సంబంధించిన వివరాలను ముందుగా నమోదు చేసుకుంటామన్నారు. 8న జరిగే ఆశాకార్యకర్తల సమావేశంలో వివరాలు సేకరించి 9న ఈ శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


మాట్లాడుతున్న ఎస్‌బీఐ మేనేజర్ మురళీకుమార్

తనకల్లు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడేశ్వరీ మండల సమాఖ్య కార్యాలయంలో ఆదర్శ రూరల్ డైవలంప్‌మెంట్ ట్రైనింగ్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్టేట్ బ్యాంక్ మేనేజర్ మురళికుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒకరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రిజర్వుబ్యాంక్ ఇండియా ద్వారా బ్యాంక్‌లో ఎలాంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నారు.. ఎలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.. బ్యాంక్‌లో ఖాతా ఉండడం వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంక్ ఫీల్డు ఆఫీసర్ మల్లికార్జున, మండల సమాఖ్య అధ్యక్షురాలు తోట సరోజమ్మ, ఆదర్శ రూరల్ డైవలప్‌మెంట్ ట్రైనింగ్ సొసైటీ కార్యదర్శి శివానంద్, అధ్యక్షురాలు లక్ష్మీదేవి, మహిళలు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

బుక్కపట్నం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ నుంచి కోడూరు వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి 342 నిర్మాణం కోసం బుక్కపట్నం మండలంలోని జానకంపల్లి వద్ద ఆక్రమణలను అధికారులు బుధవారం తొలగించారు. తహసీల్దార్ షబుద్దీన్ పోలీస్ బందోబస్తు వద్ద ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ఆక్రమణలను తొలగించారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం పూర్తికాగా, ఆక్రమణలు ఒక్కటే అడ్డుగా ఉండేది. దీంతో అధికారులు ఆ అక్రమ నిర్మాణాలు తొలగించి, రోడ్డు నిర్మాణం పూర్తి చేయడానికి సిద్ధం చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం


యాదాలంకపల్లిలో అతికించిన ప్రధాన విద్యుత్ తీగలు

బుక్కపట్నం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాదాలంకపల్లిలో విద్యుత్ తీగల రూపంలో ప్రమాదం పొంచి ఉంది. గ్రామానికి విద్యుత్ సరఫరా చేసే తీగలు రెండేళ్ల క్రితం తెగిపోయాయి. నాడు విద్యుత్ సిబ్బంది తాత్కాలికంగా అతికించి.. విద్యుత్ సరఫరా చేశారు. అయితే నేటికీ కొత్త తీగలు ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం ఎండాకాలం రావడంతో.. ఆ పాత తీగలు ఎండ వేడికి.. మరింత సాగాయి. దీంతో ఎప్పుడు ఆ తీగలు తెగి.. ఏం ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ ఎత్తివేయాలి


ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

ముదిగుబ్బ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలో విద్యార్థి తప్పిదానికి.. ఉపాధ్యాయుడు మహమ్మద్ రఫీని సస్పెండ్ చేయడం అన్యాయమని, ఆ సస్పెన్షన్ ఎత్తివేయాలని తోటి ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎంఈఓ రమణప్పకు వినతిపత్రం అందించారు.

బాధ్యతలు స్వీకరించిన ఉపాధి సిబ్బంది

గాండ్లపెంట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది పలువురు బుధవారం బాధ్యతలు స్వీకరించనట్లు ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసే ఏపీఓ మంజునాథ్, ఈసీ సుబ్బారెడ్డి నల్లచెరువుకు బదిలీ అయ్యారు. వారి స్థానంలో ఎన్పీకుంట మండలంలో పనిచేస్తున్న ఏపీఓ చంద్రశేఖర్, అమడగూరులో పనిచేస్తున్న ఈసీ ఆనంద్‌కుమార్ ఇక్కడికి వచ్చారన్నారు. అలాగే టెక్నికల్ అసిస్టెంట్లు ఆంజనప్ప, నల్లప్ప, గంగరాజు, జాఫర్, కంప్యూటర్ ఆపరేటర్లు నాగేంద్ర, సాధిక్ కూడా బాధ్యతలు చేపట్టారన్నారు.

జాతీయ రహదారి మధ్యలో గుంత

ముదిగుబ్బ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీటీ కార్యాలయం సమీపంలో జాతీయ రహదారి మధ్యలో ఏర్పడిన గుంత.. పలు ప్రమాదాలకు కారణమవుతోంది. అనంతపురం నుంచి కదిరికి నిత్యం వందలాది బస్సులు, ఆటోలు, లారీలు, ద్విచక్ర వాహనాలు వెళ్తుంటాయి. రహదారి మధ్యలో ఉన్న ఈ గుంతను తప్పించబోయి.. వాహనదారులు అనేక ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో దీని వల్ల అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

నడిరోడ్డుపై ఉన్న గుంత →



ప్రకృతి వ్యవసాయంతో లాభాలు : కలెక్టర్

రొళ్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హనుమంతనపల్లికి చెందిన రైతు వెంకటమ్మ ప్రకృతి వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించింది. ఆమె సాగుచేస్తున్న పంటలను బుధవారం కలెక్టర్ చేతన్ పరిశీలించి ఆమెను అభినందించారు. బొప్పాయి, వక్క, ముల్లంగి, క్యారెట్, బీట్‌రూట్ తదితర కూరగాయలను సాగు చేస్తూ నెలకు రూ. 15వేల వరకు ఆదాయం సంపాదిస్తోందని, ప్రకృతి వ్యవసాయంతో లాభాలు సాధ్యమని అన్నారు.

నాడు-నేడు... పూర్తి ఎన్నడు..?

దేవళం తండా ప్రాథమిక పాఠశాలలో ఆగిన పనులు


ఆగిన వంట గది నిర్మాణం


శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం

తనకల్లు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవళం తండా ప్రాథమిక పాఠశాలలో నాడు నేడు పనులు ఆగిపోయాయి. ఈ పాఠశాలలో ప్రహరీ, గేట్, మరుగుదొడ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తి అయ్యాయి. వంట గది నిర్మాణం మధ్యలో ఆగిపోయింది. పాఠశాలల గదుల్లో ఫ్లోరింగ్ కూడా చేయలేదు. పెయింట్లు వేయించాల్సి ఉంది. అదనపు గదిని నిర్మించాల్సి ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నాడు నేడు పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆ తండా వాసులు కోరుతున్నారు.

దిన్నెమీదపల్లిలో
తీవ్ర తాగునీటి ఎద్దడి

నంబులపూలకుంట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిన్నెమీదపల్లిలో తాగునీటి బోరు చెడిపోయిందని, దీంతో మూడు రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకుందని గాంధీనగర్ వాసులు వాపోతున్నారు. ఆ గ్రామానికి సమీంలోని ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన బోరు నీటితో దాహార్తిని తీర్చుకుంటున్నామన్నారు. గ్రామం మొత్తానికి ఆ బోరు నీరే దిక్కు కావడంతో.. నీటి కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందన్నారు. రక్షిత తాగునీటి బోరు చెడిపోయిందని అధికారులకు చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తాగునీటి కోసం బిందెలను క్యూలో ఉంచిన గ్రామస్థులు →



హంద్రీనీవా లైనింగ్ పనుల అడ్డగింత

తనకల్లు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నల్లచెరువు మండలంల కల్లిపల్లి సమీపంలో జరుగుతున్న హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను ఏపీ రైతు సంఘం నాయకులు, రైతులు బుధవారం అడ్డుకున్నారు. కాలువలు వెడల్పు చేసి నీటిని తీసుకురావాలని రైతులందరూ కలిసి కట్టుగా డిమాండ్ చేస్తున్నా.. పట్టించుకోకుండా ప్రభుత్వం లైనింగ్ పనులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ పనులు ఆపాల్సిందే నని భీష్మించి కాలువలోనే బైఠాయించారు. లైనింగ్ పనులు ఆపకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. హంద్రీనీవా డీఈ వేణుగోపాల్‌రెడ్డి అక్కడికి చేరుకొని వారికి సర్దిచెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి, కార్యదర్శి జంగాల పెద్దన్న, కమిటీ సభ్యులు వీవీ రమణ, శివన్న, శ్రీరాములు, నాగిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నాగేంద్ర, సీఐటియు ఒంట్టెదు వేమన్న, రైతులు పాల్గొన్నారు.


డీఈతో మాట్లాడుతున్న నాయకులు

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్


మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకొనిరావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ స్పష్టం చేశారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ - కార్యకర్తలు, ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని హిందూపురం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు అంజనప్పతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కాలనీలకు చెందిన ప్రజలు కార్యకర్తలు తమప్రాంతాల్లో ఉన్న సమస్యలను పరిటాల శ్రీరామ్ దృష్టికి తెచ్చారు. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

● సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నియోజకవర్గంలో వివిధ కారణాలతో ప్రైవేటు ఆస్పత్రిల్లో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న 12 మందికి రూ.7.68 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. వాటిని పరిటాల శ్రీరామ్ బాధితులకు అందజేశారు. ముదిగుబ్బ మండలంలో ముగ్గురికి, ధర్మవరం పట్టణంలో ఐదుగురు, రూరల్‌లో నలుగురికి ఆ చెక్కులు అందజేశారు.

టీడీపీ నాయకులు వేధిస్తున్నారని ఫిర్యాదు

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కొంతమంది టీడీపీ నాయకులు తనను, తన కుటుంబ సభ్యులను వేధిస్తున్నారని అమడగూరు మండలం మహమ్మదాబాద్ గ్రామానికి చెందిన లక్ష్మీదేవి వాపోయారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో జేసీ అభిషేక్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. తాను గ్రామంలో స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేశానని, అనాథలు, వృద్ధుల కోసం సొంత డబ్బుతో ఓ భవనాన్ని నిర్మిస్తున్నామని చెప్పారు. అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు అడ్డుకుని, దౌర్జన్యం చేస్తున్నట్లు వాపోయారు. రెండు రోజుల క్రితం తనను, తన కుటుంబ సభ్యులపై దాడి చేసి గాయపరిచినట్లు చెప్పారు. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేయగా వారు కూడా టీడీపీ వారికే వత్తాసు పలుకుతున్నట్లు ఆరోపించారు. రామగిరి మండలంలోని పాపిరెడ్డిపల్లిలో కురబ లింగమయ్యను చంపినట్లు తననూ చంపుతామని టీడీపీ వారు బెదిరిస్తున్నారని, వారి నుంచి తనకు ప్రాణహాని ఉందని వాపోయారు.


కదిరి : నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఆర్టీసీ ఉద్యోగులకు భద్రత కల్పించాలి

కదిరిఅర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల భద్రత కోసం జీఓ 19ను అమలు చేయాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ ఆధ్వర్యంలో బుధవారం డిపో ఎదుట ఆందోళన చేపట్టారు. గత ప్రభుత్వ ఉద్యోగభద్రత అమలు చేయడంతో మనోధైర్యం, ఆత్మవిశ్వాసం, సంస్థ ఆదాయం కోసం ఉద్యోగులు పనిచేశారన్నారు. ఈ ప్రభుత్వం ఆ జీవోను అమలు చేయకపోవడంతో ఉద్యోగులు అభద్రత భావం నెలకొందన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నరసింహులు, బయ్యారెడ్డి, రవి నాయక్, వలీ, సలీమ్‌బేగ్, మహమ్మద్ పాల్గొన్నారు.

● పుట్టపర్తిటౌన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ జిల్లా రీజనల్ అధ్యక్షుడు శ్రీరామ్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం పుట్టపర్తి డిపోలో ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల భద్రతకు 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. గతంలో ఉన్న వైద్య విధానాన్ని కొనసాగించాలన్నారు. ఆర్టీసీ సంస్థలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, విద్యుత్ బస్సులు కొనుగోలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు షబ్బీర్, తిరుపాలమ్మ, అప్పిరెడ్డి, శివశంకర్, శివారెడ్డి, విజయలక్ష్మి, జనార్దన్, చంద్ర, నాగరాజు, కవిత పాల్గొన్నారు.

హెల్త్ సెంటర్ తనిఖీ

కదిరిఅర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్‌ను జిల్లా క్షయ వ్యాధి నివారణాధికారి తిప్పయ్య బుధవారం తనిఖీ చేశారు. ఈ యేడాది చివరికల్లా క్షయవ్యాధి నిర్మూలనే ప్రభుత్వం లక్ష్యమని, ప్రజల్లో ఈ వ్యాధిపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగాం కోఆర్డినేటర్ మల్లికార్జున, పీటీఎం నాగేంద్రకుమార్, వైద్యులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు నివాళి

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడేపల్లి డీలర్ నిమ్మల అంజనేయులు భార్య రత్నమ్మ బుధవారం మరణించారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. డబురవారిపల్లిలో ఎస్సీ కాలనీలో క్రిష్టమ్మ ఇటీవల మరణించడంతో ఆమె కుటుంబాన్ని వారు పరామర్శించారు.

ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయకండి

అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యేలు

కదిరి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి ఫిర్యాదుకూ అధికారులు పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం తలుపుల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే మాట్లాడారు. దశలవారీగా అన్ని హామీలు పూర్తి చేస్తామన్నారు. వైసీపీ పాలనలో జరిగిన భూదందాలను వెలికి తీస్తున్నామన్నారు. భూదందాలు చేసినవారిని ఎవరిని వదలబోమన్నారు. అధికారంలో ఉన్న మనం బాధ్యతయుతంగా పనిచేయాలని, అధికారులతో పని చేయించుకోవాలని అన్నారు. 125 వినతిపత్రాలను ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీలార్ రెడ్డిశేఖర్, ఎంపీడీఓ రామానాయక్, టీడీపీ కన్వీనర్ ముబారక్, నాయకులు గరికపలి రామక్రిష్ణారెడ్డి, మేడా శంకర్, వీరభార్గవరెడ్డి, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని.. లేకుంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి హెచ్చరించారు. బుధవారం స్థానిక వెంకటసాయి ఐటీఐలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భూ సమస్యలపై అధికగా వినతులు వస్తున్నాయని, రెవెన్యూ అధికారులు వాటికి ప్రాధాన్యం ఇచ్చి.. తగాదాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు, మురుగునీటి కాలువలు, వీధి దీపాలు, ఇళ్ల నిర్మాణ బిల్లులు పెండింగ్‌లో ఉంటే వాటిని క్లియర్ చేయాలన్నారు. గ్రామాల్లో విద్యుత్ అధికారుల తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అమడగూరు, నల్లమాడ, ఓడీసీ మండలాల ప్రజల నుంచి 335 వినతులు స్వీకరించారు. ఇందులో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వివిధ శాఖల అధికారులు, కన్వీనర్లు, జయచంద్ర, గోపాల్‌రెడ్డి, షైలే శివశంకర్, మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబుళరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కదిరి : వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కందికుంట


ఓడీసీ : వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

క్రైం న్యూస్..

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

రూ.9.70 లక్షలు, రెండుతులాల బంగారం స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ

కదిరి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హిందూపురం క్రాస్‌లో నివాసముంటున్న బాబా రెడిమెట్ షాపు యజమాని బాబా ఫక్రుద్దీన్ ఇంటిలో గతనెల 17న చోరీ జరిగింది. ఈకేసులో నిందితుడు స్థానిక అలంఖాన్‌వీధికి చెందిన సాబీర్‌ను అరెస్టు చేసి.. అతని వద్ద నుంచి రూ.9.70 లక్షల నగదు, రెండు తులాల బంగారు హారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపిన వివరాల మేరకు.. సాబీర్ గతంలో ఓ బట్టల షాపులో పనిచేసేవాడు. తరువాత ఆ పని మానివేశాడు. తిరునాళ సమయంలో నిచ్చెనలు వేసి, ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న మిద్దెలపై భక్తులను ఎక్కించేవాడు. ఆలయంలో ఏ ఇంటికి దారి ఉందో పసికట్టిన సాబీర్, బాబాఫక్రుద్దీన్ ఇంటిలో ప్రవేశించి ఈ చోరీ చేశాడు. నిందితుడు స్థానిక సున్నపుగుట్టతండాకు వెళ్లే బైపాస్‌రోడ్డులో ఉండగా.. పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ కేసును ఛేదించిన పట్టణ సీఐ నారాయణరెడ్డి, ఎస్ఐ బాబ్‌జాన్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

హత్యాయత్నం కేసులో...

కదిరి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాణీ వీధిలో నివాసముంటున్న సమీవుల్లా.. వలీసాబ్‌రోడ్డులో నివాసముండే దాదాపీర్‌పై మంగళవారం హత్యాయత్నం చేసినట్లు సీఐ నారాయణరెడ్డి బుధవారం తెలిపారు. వీరిద్దరూ కలిసి గతంలో చెట్ల వ్యాపారం నిర్వహించేవారని, వారి మధ్య విభేదాలు వచ్చాయని తెలిపారు. దీంతో మంగళవారం దాదాపీర్ కత్తితో సమీవుల్లా తల, భుజాలు, డొక్కలో దాడి చేశాడన్నారు. దీనిపై సమీవుల్లా బుధవారం ఫిర్యాదు చేయడంతో దాదాపీర్‌పై కేసు నమోదు చేశామని, కత్తిని స్వాధీనం చేసుకుని, నిందితుడ్ని కోర్టులో హాజరు పరిచామని సీఐ చెప్పారు.


శ్మశాన స్థలం పట్టాను అందజేస్తున్న తహసీల్దార్

శ్మశానానికి స్థలం కేటాయింపు

గాండ్లపెంట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తూపల్లి పంచాయతి వంకపల్లి గ్రామంలో శ్మశానానికి స్థలాన్ని కేటాయించారు. అందుకు సంబంధించిన పట్టాను ఆ గ్రామస్థులకు తహసీల్దార్ బాబురావు బుధవారం అందజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గతంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్వహించిన సమావేశం దృష్టికి ఈ సమస్యను సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, వంకపల్లి గ్రామస్థులు తీసుకొచ్చారు. దీంతో ఆ గ్రామంలో సర్వే నంబర్ 767-6 లో 0.70 సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని శ్మశానానికి కేటాయించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కొండయ్య, మాజీ సింగల్‌విండో ప్రెసిడెంట్ వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ జయరామక్రిష్ణారెడ్డి, సర్పంచ్ శివప్పనాయుడు, గ్రామస్థులు చంద్ర, అనంద్, అక్రమ్, సిద్దారెడ్డి, నరసింహులు, దాసిరెడ్డి పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు


హైమాస్ట్ లైట్లు అమర్చుతున్న మున్సిపల్ సిబ్బంది

ధర్మవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీచెన్నకేశవపురం సర్కిల్లో గత టీడీపీ హయాంలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు చేశారు. కొన్ని సంవత్సరాల క్రితం ఆ లైట్లు మరమ్మతులకు గురయ్యారు. నాటి వైసీపీ పాలకులకు, అధికారులకు స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా.. ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆ సర్కిల్ అంధకారంలో ఉండేది. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత హైమాస్ట్ లైట్లు మరమ్మతులు చేపట్టాలని పలువురు కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. చివరికి టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, 25వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు సమస్యను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కమిషనర్ అక్కడ కొత్త లైట్లు వేసేలా చర్యలు తీసుకున్నారు. బుధవారం మున్సిపల్ సిబ్బంది ఆ సర్కిల్‌లో హైమాస్ట్ లైట్లు అమర్చారు. దీంతో లక్ష్మీచెన్న కేశవపురం సర్కిల్‌లో మళ్లీ వెలుగులు వచ్చాయి.

గొడవలకు దూరంగా ఉండండి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గొడవల జోలికి వెళ్లకుండా అందరూ ప్రశాంతంగా జీవించాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ప్రజలకు సూచించారు. బుధవారం మండలంలోని నేలకోటతండా గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. మద్యానికి, చెడు అలవాట్లకు బానిసలు కాకూడదన్నారు. సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వీటితో డయల్ 100, మహిళలపై జరిగే నేరాలు.. చట్టాలు.. శిక్షలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆటిజంపై అవగాహన

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆటిజం (చిన్నారుల్లో మానసిక ఎదుగుదల లోపం)పై పిల్లల తల్లులకు, బాలింతలకు, సిబ్బందికి సామాజిక ఆరోగ్య అధికారి నగేష్ బుధవారం అవగాహన కల్పించారు. ప్రపంచ ఆటిజం అవగాహన దినం సందర్భంగా ఆయనీ కార్యక్రమాన్ని చేపట్టారు. వ్యాధినిరోధక టీకాలు, తల్లిపాల విశిష్టత, వడదెబ్బ, పరిసరాల పరిశుభ్రత తదితర వాటిపై వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు పరిమిళ, ఆశాకార్యకర్తలు ముత్యాలమ్మ, శంకరమ్మ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారి

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపుల కొరత

ఈ-స్టాంపులపై అదనంగా వసూళ్లు
ప్రతి స్టాంపుపై రూ.30 వరకు తీసుకుంటున్న వైనం
చోద్యం చూస్తున్న అధికారులు



చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

చిలమత్తూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నిత్యం వందలాదిగా రిజిస్ట్రేషన్లు జరిగే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని స్టాంపుల కొరత వేధిస్తోంది. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్యాలయంలో ఆరు నెలలుగా స్టాంపుల కొరత తీవ్రంగా ఉంటోంది. దీంతో ఈ-స్టాంప్ వెండర్లు ఇష్టం వచ్చినట్లుగా అదనపు వసూళ్లకు పాల్పడుతూ వినియోగదారులపై అదనపు భారం మోపుతున్నారు. సాధారణంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ.5, రూ.10, రూ.20, రూ.50, రూ.100 స్టాంపులు అందుబాటులో ఉండేవి. అయితే ప్రస్తుతం కేవలం రూ.100 స్టాంపు మాత్రమే అందుబాటులో ఉంది. అదికూడా ఒక రోజు ఉంటే మరోరోజు స్టాకు ఉండలేని పరిస్థితి. ఈ తరుణంలో బ్యాంకు లావాదేవీలకు సంబంధించి అవసరమైన రూ. 5, రూ. 10, రూ.20, రూ.50 స్టాంపుల కోసం నానా తంటాలు పడాల్సి వస్తోంది. రూ. 5 నుంచి రూ.50 స్టాంపులు చాలా కాలంగా అందుబాటులో లేవు. దీంతో ఈ-స్టాంపు వెండర్లు కూడా రూ. 50 స్టాంపు నుంచి పై విలువ చేసే స్టాంపులనే ఇస్తున్నారు. పది రూపాయల స్టాంపు అవసరమైన డాక్యుమెంట్‌కు విధిలేక రూ.50 లేదా రూ.100 స్టాంపులను కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీంతో వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

స్టాంపుల కొరతతో ఇబ్బందులు

ఆరుల నెలలుగా నెలకొన్న స్టాంపుల కొరతతో వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రిజిస్ట్రేషన్, అగ్రిమెంట్లు, శాశ్వత విక్రయాలు, దానపత్రాలు, క్రయవిక్రయాలు తదితర లావాదేవీలకు స్టాంపులు అవసరం. అఫిడవిట్ల కోసం రూ. 10, రూ. 20 స్టాంపులు కావాలన్నా దొరకడం లేదు. కుల ధృవీకరణ పత్రాల కోసం విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఈ-స్టాంప్ వెండర్ల వద్దకు వెళితే రెట్టింపు వసూళ్లకు పాల్పడుతూ వినియోగదారులను నిలువుదోపిడీ చేస్తున్నారు. కావాల్సిన స్టాంపులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో ఈ-స్టాంప్ వెండర్లది ఆడింది ఆట పాడింది పాటగా తయారైంది. ఈ-స్టాంప్ వెండర్ల ఆగడాలను అదుపుచేయాలంటే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపుల కొరతను నివారించాల్సి ఉంది.

ఈ-స్టాంపులపై అదనపు వసూళ్లు

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపుల కొరతను ఆసరా చేసుకున్న ఈ-స్టాంపు వెండర్లు ఇష్టానుసారంగా ప్రతి స్టాంపుపై అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. వారు రూ.50లోపు విలువ చేసే స్టాంపులు ఇవ్వడానికి నిరాకరిస్తూ రూ.50, ఆపైన విలువచేసే స్టాంపులను విక్రయిస్తున్నారు. దానికి తోడు ప్రతి స్టాంపుపై రూ.30 అధికంగా వసూళ్లు చేస్తున్నారు. ఇలా ప్రతి స్టాంపుపై వసూళ్లకు పాల్పడుతున్నారు. అంతటితో ఆగకుండా తమ వద్దే రిజిస్ట్రేషన్ చలానాలు చెల్లిస్తేనే ఈ-స్టాంపులు ఇస్తామని చెబుతున్నారు.

అదనపు వసూళ్లపై చర్యలు శూన్యం

నిబంధనలకు విరుద్ధంగా స్టాంపుల విక్రయాలపై ప్రభుత్వం నిర్ధేశించిన ధర కంటే అధికంగా వసూళ్లు చేస్తున్నా సంబంధిత రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదన్న విమర్శలు ఉన్నాయి. వినియోగదారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రతిరోజు చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో వందల సంఖ్యలో స్టాంపుల విక్రయాలు జరుగుతుంటాయి. దీంతో ఈ-స్టాంప్ వెండర్లు ఇష్టం వచ్చినట్లుగా వినియోగదారుల నుంచి అధిక మొత్తాలను వసూళ్లు చేస్తూ అధిక ఆదాయాన్ని పొందుతున్నారు. నిర్ధేశించిన మొత్తం కంటే అధికంగా తీసుకుంటున్న వెండర్లపై చర్యలు తీసుకొని వారి లైసెన్స్‌లను రద్దు చేయవచ్చు. అయితే ఆవిధమైన చర్యలు తీసుకోవడంలేదని వినియోగదారులు చెబుతున్నారు.

అధికంగా వసూలు చేస్తే లైసెన్స్ రద్దు చేస్తాం

ఈ-స్టాంపు వెండర్లు వినియోగదారుల నుంచి స్టాంపు ధర కంటే అధికంగా వసూళ్లు చేస్తే వారి లైసెన్స్‌ని రద్దు చేస్తాం. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపుల కొరత ఉంది. వంద రూపాయల స్టాంపులు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన రూ.10, రూ.20, రూ.50 స్టాంపులు రావడం లేదు. అయితే దీనిని ఆసరా చేసుకొని ఈ-స్టాంపు వెండర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు ఉంటాయి. వినియోగదారులు స్టాంపు ధర మాత్రమే చెల్లించాలి. అధికంగా ఇవ్వాల్సిన అవసరం లేదు.

- ప్రసాద్‌బాబు, సబ్‌రిజిస్ట్రార్, చిలమత్తూరు

విద్యార్థులకు బరువు బాధ్యతలు..!

సోమందేపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల చేత బుధవారం ఫర్నిచర్ మోయించారు. గ్రౌండ్ ఫ్లోర్ నినుంచి రెండో అంతస్తులోని తరగతి గదుల్లోకి బరువైన బల్లలను విద్యార్థులు మోసుకెళ్లారు. మెట్ల మీద వెళ్లే సమయంలో పట్టు తప్పితే పరిస్థితి ఏమిటన్న ఆలోచన ఉపాధ్యాయులు చేయలేదు. ఈ ఫొటోలు, వీడియోలను కొందరు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ప్రస్తుతం ఆరు తొమ్మిదో తరగతి వరకూ 698 మంది విద్యార్థులు ఉన్నారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాసి వెళ్లిపోయారు. పాఠశాలలో 16 కొత్త గదులు, 12 పాత గదులు ఉన్నాయి. సీఎస్ఆర్ కింద ఓ సంస్థ ప్రతినిధులు ఇటీవల పాఠశాలకు 300 డెస్కులు, 35 చైర్లు, 50 బల్లలు, 10 కంప్యూటర్లు ఇచ్చారు. వీటిలో వినియోగానికి సిద్ధం చేసినవాటిని విద్యార్థుల చేత గదుల్లోకి చేరిస్తున్నారు. డీవైఈఓ కార్యాలయంలో మీటింగ్‌కు వెళ్లానని, ఉపాధ్యాయులు భోజనం చేస్తున్న సమయంలో విద్యార్థులే తెలియకుండా తరగతి గదిలోకి తీసుకెళ్లారని హెచ్ఎం నాగేంద్ర తెలిపారు. విచారించి చర్యలు తీసుకుంటామని ఎంఈఓ-2 ఆనంద్ బాబు తెలిపారు.



డెస్కులను తరగతి గదుల్లోకి మోసుకెళ్తున్న విద్యార్థులు

వైద్యాధికారిపై దుర్భాషలు

డీసీహెచ్ఎస్‌కు ఉద్యోగి సరెండర్... పోలీసులకు ఫిర్యాదు





వైద్యాధికారి వినోద్‌కుమార్

గోరంట్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో వైద్యాధికారిపై ఉద్యోగి భర్త దుర్భాషలాడిన విషయం ఒక రోజు ఆలస్యంగా బుధవారం వెలుగుచూసింది. ఈ వ్యవహారంలో ఉద్యోగిని డీసీహెచ్ఎస్‌కు సరండర్ చేయడంతోపాటు పోలీసులకు వైద్యాధికారి ఫిర్యాదు చేశారు. ఆస్పత్రిలో పోస్టుమార్టం అసిస్టెంట్‌గా అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న రాధ 20రోజులపాటు విధులకు హాజరుకాలేదు. మంగళవారం విధుల్లో చేరడానికి ఆస్పత్రికి వచ్చారు. ఆమెకు నైట్ డ్యూటీ వేయడంతో వైద్యాధికారి వినోద్‌కుమార్‌తో ఘర్షణపడ్డారు. ఆ సమయంలో అక్కడే ఉన్న రాధ భర్త నరేంద్ర జోక్యం చేసుకుని, డాక్టర్‌పై దుర్భాషలాడినట్లు సిబ్బంది తెలిపారు. డాక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని భావించినా, సిబ్బంది సర్దిచెప్పడంతో విరమించుకున్నారు. ఉద్యోగి రాధ రాజకీయ నాయకుల వద్దకు వెళ్లి డాక్టర్ తనను వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. మంగళవారం జాయిన్ చేసుకోవాలంటూ మరోమారు ఒత్తిడి చేశారు. వైద్యాధికారి నిరాకరించడంతో ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించారు. దీంతో ఆయన విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగిని రాధను డీసీహెచ్ఎస్‌కు సరెండర్ చేశారు. అనంతరం సీఐ శేఖర్‌కు ఫిర్యాదు చేశారు. రాధ, ఆమె భర్తను పిలిపించి సీఐ విచారణ చేస్తున్నారు. పీఎం అసిస్టెంట్ రాధను అడగ్గా.. తాను చిన్నబిడ్డ తల్లిననీ, డ్యూటీ విషయంలో తనను వేధిస్తున్నారనీ, దీంతో అనారోగ్యం పాలైనట్లు వాపోయారు. విధి నిర్వహణలో ఆమె నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వైద్యాధికారి చెప్పుకొచ్చారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి: కలెక్టర్

అగళి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ చేతన్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన అగళి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడి రికార్డులను పరిశీలించారు. అక్కడి సమస్యలపై ఆరాతీశారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. ఇదే సందర్భంలో అగళి మండలం అన్ని విధాలా వెనుకబడిందని, న్యాయం చేయాలని కలెక్టర్‌ను జడ్పీటీసీ ఉమేష్ కోరారు. అన్నిరంగాల్లో అభివృద్ధిచేయాలని కోరారు. కర్ణాటకకు ఇసుక అక్రమంగా రవాణా అవుతోందని చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్డీఓ ఆనంద్‌కుమార్, తహసీల్దార్ సుబ్బారావు, ఆర్ఐ చంద్రశేఖర్ రావు, వీఆర్ఓ లావణ్య తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

ఆలయంలో చోరీ

పరిగి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బాలరెడ్డిపల్లి గ్రామంలోని నరసింహస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి దొంగలు హుండీ పగలకొట్టి నగదును దొంగలించారు. ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపిన సమాచారం మేరకు మండల పరిధిలోని శాసనకోట గ్రామానికి చెందిన ముగ్గురు మైనర్లు అర్ధరాత్రి ఆలయంలోకి ప్రవేశించి హుండీ పగలకొట్టి రూ.13వేలు నగదును అపరహరించుకెళ్లారు. సీసీ కెమెరాల సాయంతో వారని గుర్తించి బుధవారం వారిని పట్టుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారం

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మంగాపురంలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. తాగునీటి ఎద్దడి నెలకొనడంతో మాజీ సర్పంచ్ చంద్రకాంతమ్మ, 20వ వార్డు ఇన్‌చార్జి నారాయణనాయక్ తదితరులు మంత్రి సవిత దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి సమస్యను వెంటనే పరిష్రించాలని నగర పంచాయతీ అధికారులను ఆదేశించారు. దీంతో మరమ్మతులకు గురైన బోరుబావులకు విద్యుత్ మోటార్లు అమర్చి తాగునీటి సమస్యను అధికారులు పరిష్కరించారు. గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఈద్గా కమిటీ ఎన్నిక

సోమందేపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఈద్గా కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షాషావలి, ఉపాధ్యక్షుడిగా బాబు, ప్రధాన కార్యదర్శిగా ఫరీద్, కార్యదర్శిగా ఖాసీం, సహాయ కార్యదర్శిగా అక్రమం, కోశాధికారిగా నజీర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చికిత్స పొందుతూ లైన్‌మన్ మృతి

సోమందేపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ లైన్‌మెన్ మృతి చెందాడు. గతనెల 19న మండలకేంద్రంలోని ఆర్బీకే వెనుక మరమ్మతులు నిర్వహిస్తూ రామచంద్రారెడ్డి(48) విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం బెంగళూరులోని ఓ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందినట్లు ఏఈ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు.

ప్రశాంతంగా దూరవిద్య పరీక్షలు

పెనుకొండ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో ఎస్వియు దూర విద్య పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. బుధవారం ఉదయం డిగ్రీ దూర విద్య పరీక్షలకు 133మంది హాజరు కావాల్సి ఉండగా 52మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పీజీ పరీక్షలకు 158మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 72మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ కేశవరావు తెలిపారు.

పోలీస్ స్టేషన్ ఎదుట ఇరువర్గాల వాగ్వాదం

సోమందేపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట బుధవారం ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మూడు రోజుల క్రితం గీతానగర్‌లో జరిగిన గొడవకు సంబంధించి పోలీసులు విచారణ చేపట్టారు. నిందితులను స్టేషన్‌లో విచారిస్తుండగా వారి వైపు వర్గం అక్కడకు చేరుకుంది. విషయం తెలుసుకున్న బాధితుడి వర్గం పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగా వాగ్వాదం చోటుచేసుకుంది. గీతానగర్‌లో బైక్‌పై వెళ్తున్న తేజు, విజయ్‌కుమార్, కిరణ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వేణుగోపాల్‌తో గొడవకు దిగారు. మాటామాటా పెరిగి భౌతికదాడులకు పాల్పడ్డారు. ఈ క్రమంలో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులను విచారించడానికి స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఇరువర్గాలు స్టేషన్‌కు చేరుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అప్రమత్తమైన పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకండి: ఎస్పీ

పావగడ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరు రాజ్యాంగ పరిధిలో ఉండాలని, ఎటువంటి సంఘటనలు జరిగినా చట్టాన్ని చేతిలోకి తీసుకోకుండా పోలీసులకు సహకరించాలని తుమకూరు ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. క్యాతగానకెరె గ్రామంలో మతమార్పిడి వివాదం నేపథ్యంలో బుధవారం శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ప్రార్థనా మందిరం గురించి విచారిస్తామని, తప్పు ఎవరు చేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. సమావేశంలో డీవైఎస్పీ మంజునాథ్, సీఐ గిరీష్, ఎస్ఐ లక్ష్మణ్, కానిస్టేబుల్ లమాణి పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి కారు బోల్తా

మడకశిర రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కల్లుమర్రి గ్రామ సమీపంలో హైవేలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి కారు బోల్తాపడింది. మడకశిరలో ఉన్న అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లో పనిచేస్తున్న వ్యవసాయ అధికారి ఎలిజిబెత్ సాయంత్రం విధులు ముగించుకుని మడకశిర నుంచి హిందూపురానికి కారులో వెళ్తోంది. కల్లుమర్రి గ్రామ సమీపంలో హైవేలో హిందూపురం నుంచి మడకశిరకు వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయింది. రోడ్డు పక్కనే విద్యుత్ స్తంభానికి కారు ఢీకొని పొలాల్లో బోల్తాపడింది. ఏఓకు స్వల్పగాయాలు అయ్యాయి. ఆమెను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

న్యూస్ బాక్స్

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు - కలెక్టర్ చేతన్



పంట పొలాలను పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్

రొళ్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హనువంతనపల్లికి చెందిన రైతు వెంకటమ్మ ప్రకృతి వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించింది. ఆమె సాగుచేస్తున్న పంటను బుధవారం కలెక్టర్ చేతన్ పరిశీలించి ఆమెను అభినందించారు. అందరూ ఆమెను ఆదర్శంగా తీసుకుని ప్రకృతి వ్యవసాయం చేయాలని కలెక్టర్ సూచించారు. బొప్పాయి, వక్క, ముల్లంగి, క్యారెట్, బీట్‌రూట్ తదితర కూరగాయలను సాగుచేస్తూ నెలకు రూ. 10 వేల నుంచి 15వేల వరకు ఆదాయం సంపాదిస్తోందని, ప్రకృతి వ్యవసాయంతో లాభాలు సాధ్యమని కలెక్టర్ అన్నారు. ఆర్డీఓ ఆనంద్‌కుమార్, వ్యవసాయ అధికారి సుబ్బరావు, ప్రకృతివ్యవసాయ అధికారి లక్ష్మణ్‌నాయక్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

'విజ్ఞానంతోనే దేశాభివృద్ధి'



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): విజ్ఞానంతోనే దేశాభివృద్ధి సాధ్యమని చిన్మయ పాఠశాల కరస్పాండెంట్ భీమరాజు, ప్రిన్సిపాల్ సరళ పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఫిబ్రవరి 28న విజ్ఞానంపై విద్యార్థుల ప్రతిభను వెలికి తీసే విధంగా రాష్ట్రస్థాయి లో పోటీలను నిర్వహించారు. ఆన్‌లైన్‌లో జరిగిన ఈ పోటీలో హిందూపురం చిన్మయ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. 'సుస్థిర అభివృద్ధి' అంశంలో 8వ తరగతి విద్యార్థిని పూర్ణిక మొదటి స్థానంలో నిలువగా, 'మూఢనమ్మకాలు శాస్త్రీయ దృక్పథం' అంశంలో 9వ తరగతి విద్యార్థిని అచ్యుత రెండవ స్థానం సంపాదించింది. బుధవారం ప్రతిభకనబరచిన విద్యార్థులను కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ అభినందించారు.

సమస్యల సాధనకు సమావేశం



సమావేశమైన మేట్లు

గోరంట్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి పథకం ద్వారా పనిచేస్తున్న మేట్లు సమస్యల సాధన కోసం బుధవారం సమావేశం నిర్వహించారు. కార్మిక సంఘం నాయకుల ఆధ్వర్యంలో గోరంట్ల, బూదిలి, కొండాపురం, కమ్మలవాండ్లపల్లి ప్రాంతాల్లో పనిచేస్తున్న మేట్లు గోరంట్లలోని మాధవరాయ ఆలయంలో సమావేశమయ్యారు. రోజుకు ఒక కూలీ మీద రూ. పది పారితోషకం ఇవ్వాలని, గుర్తింపుకార్డులు, కొలతల టేపు, మస్టర్లు, పెన్నులు, పెన్సిల్స్‌లను ప్రభుత్వంలో అందించాలన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, స్వర్ణలత, కొండా వెంకటేష్, కంబాలప్ప, రవి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి శక్తులను అరికట్టండి : సీపీఎం



ఎస్ఐకి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

సోమందేపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): చేనేత అడ్డాలో గంజాయి శక్తులకు అరికట్టాలని సీపీఎం నాయకులు ఎస్ఐ రమేష్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం ఎస్ఐకి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలో గంజాయి, జూదం, ఆన్‌లైన్, మట్కా విస్తృతంగా మద్యం విక్రయాలు, ఇతర మత్తు పదార్థాలకు స్థానిక యువకులు బానిసలుగా మారుతున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే తరచూ ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయన్నారు. నిఘా వ్యవస్థ విఫలం కావడంతో గంజాయి చాపకింద నీరలా విస్తరిస్తోందని వివరించారు. గంజాయి విక్రయాలు జరిగే ప్రదేశాలను రెడ్‌జోన్‌లు ప్రకటించాలన్నారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, అనుబంధ సంఘాల నాయకులు కిష్టప్ప, కొండా వెంకటేశులు, గంగప్ప, రవి తదితరులు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

సిల్కు కాలనీలో కార్డెన్ సెర్చ్

హిందూపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిల్కు కాలనీలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులులేని ద్విచక్రవాహనాలు, ఆటోలను సీజ్‌చేసి టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఎస్ఐ బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలను ప్రజలకు వివరించారు. రికార్డులులేని వాహనాలను కొనుగోలు చేయకూడదని హెచ్చరించారు. శక్తియాప్ ఎను డౌన్‌లోడ్ చేసుకోవాలని మహిళలకు వివరించారు.

నేడు శాంతి కమిటీ సమావేశం

హిందూపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పండగను పురస్కరించుకుని నిర్వహించనున్న సూగూరు ఆంజనేయ స్వామి బ్రహ్మరథోత్సవం నేపథ్యంలో గురువారం సాయంత్రం శాంతి కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటేశులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ సమావేశానికి మున్సిపల్ చైర్మన్, కమిషనర్, డీఎస్పీ, సీఐలు, ఆర్‌అండ్‌బి, ట్రాన్స్‌కో, మునిసిపల్ అధికారులు హాజరు కావాలన్నారు.

విద్యుత్ షాక్‌తో గాయాలు

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టూరు గ్రామంలో సప్లయర్స్ నిర్వాహకుడు రఫీక్ బుధవారం విద్యుదాఘాతానికి గురయ్యాడు. గుట్టూరులోని ఓ ఇంటి వద్ద షామియానా వేస్తుండగా ప్రమాదవశాత్తు 11కేవీ విద్యుత్ వైర్లు తగిలి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

దుకాణాలపై అధికారుల దాడులు

ప్లాస్టిక్ విక్రయిస్తున్న వారిపై కేసుల నమోదు



తనిఖీలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

పెనుకొండ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని పలు దుకాణాలపై మున్సిపల్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఉదయం కమిషనర్‌తోపాటు సిబ్బంది రాంప్రసాద్, వినోద్‌కుమార్, పవన్‌కుమార్ తదితరులు దుకాణాలపై దాడులు చేశారు. అంబేడ్కర్ నగర్‌లో దాడులు నిర్వహించి ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తున్న ఏడుగురు దుకాణదారులపై కేసులు నమోదు చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నిషేధించడం జరిగిందన్నారు. దుకాణాల్లో వాటిని విక్రయిస్తున్నారని, ఈ నేపథ్యంలో దాడులు చేయడం జరిగిందన్నారు. ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేశామని, వారికి రూ. 21 వేలు జరిమానా విధించడం జరిగిందన్నారు. దుకాణాల్లో, హోటళ్లల్లో ప్లాస్టిక్ కవర్లుగాని, గ్లాసులుగాని, ఏ ఇతర ప్లాస్టిక్ వస్తువులను వాడినా జరిమానా విధించడంతోపాటు కేసులను నమోదు చేస్తామన్నారు.

మంత్రి దృష్టికి డ్రైనేజీ సమస్య

పరిష్కరించాలని కమిషనర్‌కు ఆదేశం



డ్రైనేజీని పరిశీలిస్తున్న మంత్రి సవిత, కమిషనర్ సతీష్‌కుమార్

పెనుకొండ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ పూర్తిగా చెత్తాచెదారంతో నిండి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పట్టణంలోని గడంగివీధివాసులు.. మంత్రి సవితకు విన్నవించారు. మంగళవారం పింఛన్ల పంపిణీకి వచ్చిన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పరిశీలించిన మంత్రి వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్‌ను ఆదేశించారు.

యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రమాణ స్వీకారం



డిక్లరేషన్‌లో సంతకం చేయిస్తున్న మంత్రులు

పెనుకొండ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా కేశవయ్య బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్లనరసింహయాదవ్‌తోపాటు డైరెక్టర్‌గా కేశవయ్య ప్రమాణస్వీకారం చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చన్నాయుడు ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో మంత్రులు సవిత, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా స్థానిక నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, వీపీపాళ్యం శ్రీనివాసులు, పట్టణ కన్వీనర్ శ్రీరాములుయాదవ్, పెద్దసంఖ్యలో కార్యకర్తలు ప్రమాణస్వీకారానికి తరలివెళ్లారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

రోడ్డుపై బైఠాయించి మహిళల నిరసన



రోడ్డుపై బైఠాయించిన మహిళలు

రొళ్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని మహిళలు డిమాండ్ చేశారు. మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన మహిళలు బుధవారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. వెంటనే నీటి సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో కలెక్టరేట్ వద్ద ధర్నాచేస్తామని హెచ్చరించారు.

ఘనంగా ఉట్ల పరుష



అలంకరణలో మారెమ్మ దేవత

గోరంట్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీనవాండ్లపల్లి మారెమ్మ ఆలయం వద్ద ఉట్ల పరుషను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఏటా ఉట్లపరుషను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మారెమ్మను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పరుషను తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

దరఖాస్తు చేసుకోండి

మడకశిర రూరల్/టౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పాలిసెట్ 2025 పరీక్షలు రాసే విద్యార్థులు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని గుండుమలలోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాధాకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 7 నుంచి 28 వరకు ఉచిత శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తరగతులు ఉంటాయని, శిక్షణతోపాటు స్టడీ మెటీరియల్ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సెల్ నెంబర్ 8247529542. 9492660993ను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

యానిమేటర్లకు శిక్షణ

పరిగి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని వెలుగు కార్యాలయంలో బుధవారం ఏపీఎం రామేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో యానిమేటర్లకు వార్షిక రుణ జీవనోపాధులపై శిక్షణను నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్‌సి విజయ్‌భారతి, భారతమ్మ, రామచంద్ర, మల్లికార్జున, కవిత పాల్గొన్నారు.